నవతెలంగాణ
నమ్మదగ్గ తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
బుధవారం | మే 08, 2024 | www.navatelangana.com


## ఆత్రం సక్కుని గెలిపించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్



ఆత్రం సక్కుని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ నాయకులు కుమ్ర రాజు అన్నారు. మంగళవారం మండలంలోని లోహార గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాల్లో పర్యటించి, ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికి స్టిక్కర్లు అతికించారు. ప్రతి ఆదివాసీకి ఏ కష్టం వచ్చిన అందుబాటులో ఉండి పరిష్కరిస్తామని అన్నారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్, పీఏసీఎస్ చైర్మెన్ మెస్రం పరమేశ్వర్, ఎస్టీ సెల్ కుమ్ర మోతీరాం, మాజీ సర్పంచులు సిడాం లక్ష్మణ్, కొడప మాధవరావు, దుర్వ రాంచందర్, కుమ్ర వసంత్, సీడం గణపతి, రాజు పాల్గొన్నారు.

## ఆత్రం సుగుణను గెలిపించుకుందాం

నవతెలంగాణ-తాంసి




కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను ఎంపీగా గెలిపించుకుందామని కాంగ్రెస్ మండల నాయకులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆత్రం సుగుణను గెలుపు కోసం ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కేంద్రంలో అధికారంలోకి వస్తే అమలు చేసే మేనిఫెస్టో కరపత్రాలను ఓటర్లకు వివరించారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి మరింత జరుగుతుందని అన్నారు. రైతులకు రుణమాఫీ అవ్వడం ఖాయం అన్నారు. చేతి గుర్తుపై ఓటు వేసి ఆత్రం సుగుణను ఎంపీ అభ్యర్థిగా గెలిపించుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నారాయణ, సంతోష్, రామన్న యాదవ్, శ్రీధర్‌రెడ్డి గంగారెడ్డి, నరేష్, కిష్టన్న ఉన్నారు.

# ప్రచారం తీరు మారింది గురూ...

- కనిపించని ర్యాలీలు, మైకుల హోరు
- కానరాని హంగూ ఆర్భాటాలు
- సోషల్ మీడియాతో అధిక ప్రాధాన్యత

**ఒకప్పుడు ఎన్నికలు వచ్చాయంటే ఊరూరా ర్యాలీలు, మైకుల హోరుతో ప్రచారం జోరుగా సాగేది. శాసనసభ, లోక్‌సభ స్థానాల బరిలో నిలిచిన అభ్యర్థులు కనీసం ఒక్కసారైనా ప్రతీ గ్రామాన్ని చుట్టొసి వచ్చేవారు. ప్రస్తుతం నియోజకవర్గ, మండలకేంద్రాల్లో అడపాదడపా ర్యాలీలు, కార్యకర్తల సమావేశాలకే అభ్యర్థులు, ముఖ్య నేతలు ప్రాధాన్యమిస్తున్నారు. కొన్నిచోట్ల ఉదయం పూట వాకర్స్‌ను కలిసి కాసేపు ముచ్చటిస్తున్నారు. అలాగే వివిధ సామాజిక వర్గాల వారీగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. ఇంటింటికి తిరిగి ఓటు అభ్యర్థించే బాధ్యతలను స్థానిక నాయకులకు అప్పగించడం ప్రాధాన్యం సంతరించుకుంది.**



నవతెలంగాణ-దహెగాం

ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో హంగూ ఆర్భాటాలు పెద్దగా కనిపించడంలేదు. పోలింగ్ సమయం దగ్గరపడుతున్నా కనీసం గ్రామాల్లో పూర్తిస్థాయిలో ప్రచారం కరువైంది. ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో మండల నాయకులు సైతం పెద్దగా కాలు కదిపేందుకు ఇష్టం చూపడం లేదు. ఎన్నికలపై గ్రామాలు, మండలాల్లో రచ్చబండ చర్చలు అంతంత మాత్రంగానే జరుగుతున్నాయి. గతంలో పెద్ద నాయకులు, ముఖ్య నాయకులు వచ్చినప్పుడు పెద్దఎత్తున ర్యాలీలు నిర్వహించి బలాన్ని ప్రదర్శించేవారు. దీనికోసం రోజూవారీ కూలీలను రప్పించేవారు. ప్రచారం అనంతరం వారికి కూలీలతో పాటు భోజనం, మద్యం వంటివి పంపిణీ చేసేవారు. దీనివల్ల ఖర్చు తడిసి మోపడయ్యేది. ర్యాలీలో పాల్గొన్న వారికి కండువాలు, టోపీలు, ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు సమకూర్చి వాటికి ఇందనం ఖర్చు, ఇతర ఖర్చులు సైతం ఎన్నికల అధికారులు లెక్కిస్తుండడంతో వ్యయ పరిమితి దాటుతుందనే భయంతో అభ్యర్థులు వీటిపై ఆసక్తి కనబరచడం లేదని తెలుస్తోంది. కేవలం ప్రధాన కేంద్రాల్లో ఒకటి లేదా రెండు పెద్ద సమావేశాలు నిర్వహించినప్పుడే మాత్రమే జనాన్ని తరలించి డబ్బులు ఆదా చేస్తున్నారు.

**సోషల్ మీడియా ప్రచారం పైనే దృష్టి..!**

ప్రధాన పార్టీల అభ్యర్థులు సోషల్ మీడియా ప్రచారంపై ఎక్కువగా దృష్టి సారిస్తున్నారు. వాట్సప్, ఫేస్‌బుక్ చేస్తూ ఇన్‌స్టాగ్రామ్ తదితర మాధ్యమాల ద్వారా ఓటర్లకు చేరువయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. సంక్షిప్త సందేశాలు, వాయిస్‌కాల్‌పై ఆధారపడుతున్నారు. దినపత్రికల్లో ఆకట్టుకునే నినాదాల ప్రకటనతో ఓటర్ల మదిని గెలుచుకొనేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఏదేమైనా గతానికి నేటికి ఎన్నికల ప్రచారం తీరు మారిపోయిందనే చెప్పడంలో సందేహం లేదు.

# అకాల వర్షం.. అపార నష్టం..

- గాలి, వానకు పలుచోట్ల లేచిపోయిన రేకులు
- విరిగిపడిన చెట్లు
- లేచిపోయిన పైకప్పులు



పెంచికల్‌పేట్

నవతెలంగాణ-దహెగాం

మండలంలో మంగళవారం గాలివాన భీభత్సం సృష్టించింది. అకాల వర్షంతో అపార నష్టం వాటిల్లింది. కొన్ని రోజులుగా ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు వాతావరణం ఒకేసారి చల్లబడడంతో పాటు గాలివాన సృష్టించిన విధ్వంసానికి అపార నష్టం వాటిల్లింది. మండల కేంద్రంలో తాటిచెట్టుపై పిడుగుపడడంతో తాటిచెట్టు పూర్తిగా కాలిపోయింది. అలాగే ఐనం, బీబ్రా, బోర్లకుంట తదితర గ్రామాల్లో గాలి, వానతో పాటు రాళ్ల వర్షం కురిసింది. బీబ్రా గ్రామంలో గాలి, వానకు విద్యుత్ తీగలపై చెట్లు విరిగిపడగా తీగలు ఇండ్లపై పడ్డాయి. బోర్లకుంట గ్రామంలో బొందుగుల స్వామి ఇంటి పైకప్పు లేచిపోగా ఇంటి గోడలు కూలిపోయాయి. కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం వర్షం దాటికి తడిసిముద్దైంది. గాలి, వాన భీభత్సంతో పంటలు నష్టపోవడమే కాకుండా విద్యుత్ తీగలు తెగిపడడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొంది. అకాల వర్షానికి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

**ఆసిఫాబాద్ :** నెల రోజులుగా ఎండ వేడితో ఉక్కిరిబిక్కిరి అవుతున్న జిల్లా వాసులకు మంగళవారం ఈదురు గాలులతో కూడిన కురిసిన భారీ వర్షం ఉపశమనాన్ని ఇచ్చింది. జిల్లా కేంద్రంలో మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా ఈదురు గాలులతో కూడిన రాళ్ల వర్షం కురిసింది. దాదాపు గంట పాటు కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడింది.

**చింతలమానేపల్లి :** మండలంలో వారం పది రోజుల నుండి భానుడి ఉగ్రరూప ప్రభావంతో 40 నుండి 45 ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. ఎండవేడికి బయటికి వెళ్లలేక, ఉక్కిరిబిక్కిరి అయ్యారు. మంగళవారం మధ్యాహ్నం నుండి చినుకులతో ప్రారంభమైన వర్షం భారీగా కురిసింది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.



దహెగాం

**పెంచికల్‌పేట్ :** మండల వ్యాప్తంగా మంగళవారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. వాన భీభత్సానికి రైతులు కల్లాల్లో ఉన్న వరిధాన్యం కొన్నిచోట్ల తడవగా ఎల్లూరు వరి కొనుగోలు కేంద్రం వద్ద రైతులు టార్పాలిన్ కవర్లు కప్పి ధాన్యాన్ని రక్షించుకున్నారు. మండలంలోని బొంబాయిగూడ గ్రామం వద్ద విద్యుత్ వైర్లపై చెట్టు కొమ్మ పడడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. వరి కోతలు పూర్తికాకపోవడంతో రైతులు అకాల వర్షానికి ఇబ్బందులు పడుతున్నారు.

**బెజ్జూరు :** మండలంలోని కుకుడ, ముంజంపెల్లి గ్రామాల్లో వడవళ్ల వర్షం కురిసింది. పెద్దపెద్ద వడగళ్లు పడడంతో గ్రామాల్లో పెంకలు పగిలిపోయినట్టు గ్రామస్తులు తెలిపారు. ఈదురు గాలులకు కరెంటు అంతరాయం ఏర్పడడంతో ఉదయం నుండి కరెంటు లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సోమవారం రాత్రి వేడి తీవ్రంగా ఉండడంతో కరెంటు లేక ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కరెంటు సమస్య తీవ్రంగా ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని మండల వాసులు ఆరోపిస్తున్నారు. తీవ్ర ఎండతో ఉక్కపోతతో బాధపడుతున్న ప్రజలకు మంగళవారం మధ్యాహ్నం నుండి వాతావరణం చల్లబడడంతో కొంత ఊపిరి పీల్చుకున్నారు. ఈదురు గాలులతో ఉష్ణోగ్రత తగ్గడంతో వాతావరణం చల్లబడి కొంతమేర ఉపశమనాన్ని కలిగించింది.



చింతలమానేపల్లి



ఆసిఫాబాద్

## అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యమని రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడుతున్నామని డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ అన్నారు. మండలంలోని దస్నాపూర్, అంకుషాపూర్‌తో పాటు జిల్లా కేంద్రంలోని పలు కాలనీలో పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ తరపున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేండ్లలో దేశాన్ని బీజేపీ భ్రష్టు పట్టించిందన్నారు. కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ పేద ప్రజల పొట్ట కొడుతుందన్నారు. సబ్బండవర్గాల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, మసాడే చరణ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గాదవేణి మల్లేష్, నాయకులు శివ, గోవింద్, బీసీ రైతు అధ్యక్షుడు మారుతి పటేల్, నాయకులు పాల్గొన్నారు.

## వడ దెబ్బతో ఉపాధి కూలీ మృతి

నవతెలంగాణ-తాంసి



భీంపూర్ మండలంలోని వడ దెబ్బతో ఉపాధిహామీ కూలి పనులకు వెళ్లిన మస్కాపూరి ఇస్తారి(35) సోమవారం అర్ధరాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబీకులు గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... అర్లి(టి) గ్రామానికి చెందిన మస్కాపూరి ఇస్తారి రోజు మాదిరిగానే శనివారం ఉపాధి హామీ చట్టంలో భాగంగా ఉపాధి పనికి వెళ్లాడు పనులు చేస్తున్న నేపథ్యంలో ఎండ తీవ్రత ఉండటంతో కాస్త తల తిరుగుతుందని తోటి కూలీలకు చెప్పాడు. పని ముగించుకొని ఇంటి వచ్చిన తరువాత కాసేపటికి, వాంతులు రావడంతో ఇంటి వద్ద ప్రథమ చికిత్స చేయించుకున్నాప్పటికి అయినా వాంతులు తగ్గక పోయే సరికి శనివారం రాత్రి సమయంలో 108లో రిమ్స్‌కు తరలించారు. అప్పటి వరకు చికిత్స పొందుతూ సోమవారం రాత్రి సమయంలో మృతి చెందినట్టు వైద్యులు ధృవీకరించారు. రెక్కడితే గానీ డొక్కాడని కుటుంబం పని చేయనిదే పూట గడువని పరిస్థితిలో ఉన్నారు. ప్రభుత్వం నుంచి ఏదైనా సాయం వచ్చే విధంగా చూడాలని కోరుతున్నారు. పని ప్రదేశంలో వసతులు కల్పించక పోవడంపై కూలీలు పనులకు వెళ్లాలంటే జంకుతున్నారు.

## పిడుగు పడి ఎద్దు మృత్యువాత

నవతెలంగాణ-కౌటాల

పిడుగు పడి ఎద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని నాగెపెల్లి గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుడు మోర్లె దసురు తెలిపిన వివరాల ప్రకారం.. వ్యవసాయం చేసుకోవడానికి రెండు ఎద్దులు ఉన్నాయని, వేసవి కాలం కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు మేత కోసం పంట పొలాల్లో తిరుగుతుంటాయని తెలిపారు. మంగళవారం ఉరుములు మెరుపులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. ఊరు బయట మేత మేసుకుంటూ ఉండగా పిడుగు పడి తన ఎద్దు మృతి చెందిందని విలపించాడు. ఎద్దు విలువ సుమారు సుమారు రూ.50 వేలు ఉంటుందని ప్రభుత్వం స్పందించి ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

# సత్వర న్యాయానికి లోక్ అదాలత్ మంచి మార్గం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బాధితులకు సత్వర న్యాయం అందించడానికి లోక్ అదాలత్ మంచి మార్గమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కే.ప్రభాకర్‌రావ్ అన్నారు. జూన్ 8న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకుని మంగళవారం కోర్టులో న్యాయవాదులు, అధికారులతో సన్నహాక సమావేశం నిర్వహించారు. జిల్లా కోర్టులో జరిగిన ఈ సమావేశంలో అధికారులు, ఆయా ఇన్సురెన్స్ కంపెనీల ప్రతినిధులు, న్యాయవాదులు, పోలీసులు హాజరై పలు సూచనలు చేశారు. సూచనలు స్వీకరించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి అత్యధిక కేసుల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని వృథా చేసుకోకుండా కేసులను సత్వరంగా పరిష్కరించేందుకు లోక్ అదాలత్ లు మంచి మార్గమని తెలిపారు. దీనిపై కక్షిదారులకు తెలియజేస్తూ అత్యధికంగా కేసులను పరిష్కరించేల ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. క్రిమినల్ కేసుల్లో కొంత సమస్యలు వస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. సమస్యలు రాకుండా చూస్తామన్నారు. జూన్ 8న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌పై ప్రతి ఒక్కరికి తెలియజేస్తూ అధిక సంఖ్యలో కక్షిదారులు హాజరయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు ప్రమీల జైన్, మంజుల సూర్యవార్, దుర్గారాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్రాల నగేష్, న్యాయవాదులు పాల్గొన్నారు.

## డా.బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలి

- ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

డా.బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఈనెల 14న ఉట్నూర్ మండలంలోని ఉమ్రి గ్రామంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే గౌతమ బుద్ధుడు, అంబేద్కర్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలనీ కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ దళిత సంఘాల నాయకులతో కలిసి జయంతి ఉత్సవాలకు సంబంధించిన గోడపత్రలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచానికి శాంతి అహింసయుత మార్గాన్ని చూపిన బుద్దుడు, అణగారిన తాడిత, పీడిత వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు డా. బాబాసాహెబ్ అంబేద్కర్ చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. ఈ జయంతి ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు, బహుజన సంఘాల నాయకులు, మేధావులు, విద్యార్థులు, కార్మికులు, కర్షకులు, పెద్ద ఎత్తున తరిలి వచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలనీ పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు, దళిత సంఘాల నాయకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కాంగ్రెస్, బీజేపీలు

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్



నవతెలంగాణ-ఇచ్చోడ

ప్రజాస్వామ్యాన్ని కాంగ్రెస్, బీజేపీలు ఖూనీ చేస్తున్నాయని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కార్నర్ మీటింగ్‌కు ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పాలనలో ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వేలైన్, యూనివర్సీటీ ఏర్పాటు చేయకపోవడం దారుమని అన్నారు. 75 ఏండ్లుగా అగ్రకుల పార్టీలు ప్రజలను మోసం చేశాయని, మరోసారి మోసం చేసేందుకు సిద్ధమయ్యాయని అన్నారు. మళ్లీ ఆ పార్టీలకు ఓటు వేయొద్దని ప్రజలు ఒకసారి బీఎస్పీ ఎంపీ అభ్యర్థి జంగుబాపుకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ ఎంపీ అభ్యర్థి మెస్రం జంగుబాపు, పార్లమెంటరీ ఇన్‌చార్జ్ జగన్మోహన్, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు మార రాజన్న, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు రత్నపురం రమేష్, ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు ముద్దసీర్ హుస్సేన్, నిర్మల్ మహిళా కన్వీనర్ లక్ష్మి యాదవ్, ఖానాపూర్ అసెంబ్లీ అధ్యక్షుడు రాజేష్, ఆదిలాబాద్ అధ్యక్షుడు దుమ్మ శ్రీహరి, హరినాథ్, లక్ష్మణ్ యాదవ్ పాల్గొన్నారు.

## కళాశాలలో దోస్త్ సహాయ కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ కళాశాలల్లో దోస్త్ (డీఓఎస్టి) ద్వారా ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్‌లో దోస్త్ సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, దోస్త్ కోఆర్డినేటర్ డా.నర్సింగరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రీలో ప్రవేశాల కోసం ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు దోస్త్ రిజిస్ట్రేషన్ సంబంధిత అనుమానాల నివృత్తి కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియలో తలెత్తే సాంకేతిక లోపాలను సరిదిద్దుకోవడానికి సహాయ కేంద్రాన్ని సంప్రదించగలరని సూచించారు. ఈ దోస్త్ హెల్ప్ లైన్ సెంటర్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కొరకు 9703533626, 9441012766 నెంబరును సంప్రదించాలని సూచించారు.

## రాజ్యాంగం పూర్తి స్థాయిలో అమలు కావాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

భారత రాజ్యాంగం పూర్తిస్థాయిలో అమలుకావాలంటే కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో గెలువాల్సిన అవసరం ఎంతైనా ఉందని కాంగ్రెస్ ఆదివాసీ పార్లమెంటు కోఆర్డినేటర్ సెడ్మకి ఆనంద్‌రావ్ అన్నారు. మంగళవారం మండలంలోని అలికోరి, పొట్యన్‌లొద్ది, చిచ్‌ధరి, ఖానాపూర్, ఎస్సీగూడ, గోండుగూడ, రాజుగూడ, మారుమూల గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఆదివాసుల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతో సాధ్యమని అన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి అయిన ఆత్రం సుగుణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఆదివాసీ విభాగం చైర్మెన్ చౌహన్ రాహుల్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆడే గోపాల్, సీనియర్ నాయకులు తొడసం కేశవ్, సెడ్మకి బొజ్జు, గ్రామ పటేల్, దేవరి, మహజన్ పాల్గొన్నారు.

## గెలుపు ఖాయం

నవతెలంగాణ-ఇచ్చోడ

కాంగ్రెస్ గెలుపు ఖాయమని, కష్టపడితే భారీ మెజారిటీ సాధిస్తామని మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో జరుగుతున్న ఎన్నికలు రెండు పార్టీల మధ్య కాకుండా, రెండు సిద్ధాంతాల మధ్య జరుగుతుందని అన్నారు. ఈ యుద్ధంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని అన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. బూత్ స్థాయిలో ప్రతి ఒక కార్యకర్త కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ రాష్ట్రంలో అమలు చేస్తున్న 6 గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఓటర్లకు వివరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, మాజీ ఎమ్మెల్యేలు రాథోడ్ బాపురావు, రేఖనాయక్, బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ బొడ్డు గంగారెడ్డి, జెడ్పీటీసీలు గోక గణేష్‌రెడ్డి, మల్లెపూల నర్సయ్య, వైస్ చైర్మెన్ ఆడే వసంత్, ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర వైస్ చైర్మెన్ కుంరం కోటేశ్వర్, ఆదిలాబాద్ జిల్లా అధికార ప్రతినిధి వసుల చంటి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మహమూద్ ఖాన్ పాల్గొన్నారు.



## పీడీఎస్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-చింతలమానేపల్లి



మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు గూడెం గ్రామ సమీపంలో పట్టుకున్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుండి గుడెం మీదుగా మహారాష్ట్రలోని ఆహిరి, ఆలపల్లికి పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నరన్న సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, పోలీస్ సిబ్బంది గూడెం గ్రామం సమీపంలో తనిఖీలు నిర్వహించారు. ఐదు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోలో తరలిస్తున్న వారిని పట్టుకొని వారి వద్ద నుంచి 11 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని టాస్క్‌ఫోర్స్ సీఐ సీహెచ్ రాణా ప్రతాప్ తెలిపారు. గ్రామాల్లో పేకాట, ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్, ఆన్‌లైన్ జూదం, మట్కా, కోడి పందేలు లాంటివి ఆడి జీవితాలు పాడుచేసుకోవద్దన్నారు. అలాంటి వారిపై చట్టరీత్యా తీసుకుంటామని హెచ్చరించారు. ఇందులో పీసీ మధు, రమేష్, సంజీవ్, బాలరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణకు మద్దతిస్తాం

- గండ్రత్ సుజాత, సంజీవ్ రెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను మద్దతు తెలుపుతున్నామని అభ్యర్థి తరపున ప్రచారంలో పాల్గొంటామని మాజీ టీపీపీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత స్పష్టం చేశారు. మంగళవారం మాజీ మంత్రి, దివంగత నేత సీఆర్ఆర్ నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ సంజీవ్ రెడ్డితో కలిసి మాట్లాడారు. ప్రజా జీవనంలో కొనసాగలని ఇటీవల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి నిర్ణయించడం జరిగిందని అన్నారు. కాంగ్రెస్అభ్యర్థి ఆత్రం సుగుణ గెలుపుకు కషి చేస్తామన్నారు. గతంలో జరిగిన వాటి గురించి తాము ఇప్పుడు చర్చించమని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజ జీవనంలో ఉంటూ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పని చేస్తామని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి చేయడానికి తమ వంతుగా కషి చేస్తామన్నారు.

## జోరుగా బీఆర్ఎస్ ప్రచారం

నవతెలంగాణ-తలమడుగు



మండలంలోని ఖోడద్ గ్రామంలో మంగళవారం బీఆర్ఎస్ నాయకులు గడపగడపకు ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఖోడద్ గ్రామస్తులను ఓట్లు అభ్యర్థించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీఆర్ఎస్ నాయకులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. జిల్లాలో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు కావడంతో ఉదయమే గ్రామాల్లోకి వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ ప్రచారంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ తోట వెంకటేష్, మాజీ సర్పంచ్ సాకి ఆనంద్, ఆశన్న యాదవ్, లక్ష్మారెడ్డి, నరేందర్, ప్రకాష్, అభిరామిరెడ్డి, గజానన్, చంటి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## సీపీఐ(ఎం) బలపరుస్తున్న కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

సీపీఐ(ఎం) బలపరుస్తున్న కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యవర్గ సభ్యులు బండి దత్తాత్రి, లంక రాఘవులు అన్నారు. మంగళవారం మావల మండల కేంద్రంలో సీపీఐ(ఎం) బలపరుస్తున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సుగుణను గెలిపించాలని కోరారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతిగుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. మతోన్మాద బీజేపీని ఓడించి, కాంగ్రెస్‌ను గెలిపిద్దామన్నారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని అన్నారు. ఈ ప్రచారంలో సీపీఐ(ఎం) నాయకులు పూసం సచిన్, లంక రాఘవులు, మంజుల, లంక జామున పోసాని, రేణుక, శకుంతల, ఆశన్న, పంచపూల పాల్గొన్నారు.

## జోరుగా ఆత్రం సుగుణ ప్రచారం



నవతెలంగాణ-ఉట్నూర్

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ ప్రచారం జోరుగా కొనసాగుతుంది. అందులో భాగంగా మంగళవారం మండలంలోని శ్యాంనాయక్ తండా, హస్నాపూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఉపాధిహామి కూలీలతో సమావేశమై గడపగడపకు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలి



నవతెలంగాణ-ఉట్నూర్

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్ అన్నారు. మంగళవారం మండలంలోని పాత ఉట్నూర్, రాంనగర్ తదితర వాడల్లో గడప గడపకు తిరుగుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ధరణి రాజేష్ మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోనే ఉంటూ వారికి ఎల్లవేళలా అండగా నిలువాలని అన్నారు. పదేండ్లపాటు అధికారంలో ఉండి అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అందించామన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అధికారంలోకి వచ్చిన తరువాత చేసే అభివృద్ధి ఏమి లేదని, వారి వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజలతో కలిసి ఎండగట్టాలని సూచించారు. బీఆర్ఎస్ పార్టీ బలపర్చిన ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించి, పార్లమెంట్‌కు పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సీతారాం, రామగిరి వాసు, బాబా శ్యామ్, అన్వేష్, దినేష్, ప్రదీప్, రాజు పాల్గొన్నారు.

# ఆరు మండలాలకు ఒకే ఫైరింజన్

- వచ్చేలోపే కాలి బూడిద
- రెండు చోట్ల ప్రమాదాలు జరిగితే అంతే సంగతి



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది



కాలిబూడిదవుతున్న మొక్కజొన్న పంట

నవతెలంగాణ-ఇచ్చోడ

ఇచ్చోడ మండల కేంద్రంలోని అగ్నిమాపకశాఖ కార్యాలయంలో ఒకే ఒక ఫైరింజన్ అందుబాటులో ఉంది. ఒక ఫైరింజన్‌నే ఆరు మండలాలకు ఉపయోగిస్తున్నారు. బోథ్ నియోజకవర్గంలోని ఇచ్చోడ, బజార్‌హత్నూర్, బోథ్, నేరడిగొండ, గుడిహత్నూర్, సిరికొండలకు ఒకే ఫైరింజన్‌ను వాడుతున్నారు. రెండు చోట్ల ఒకే సారి ప్రమాదం సంభవిస్తే ఇబ్బందులు ఎదురైయ్యే అవకాశం ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. ఉన్న ఒక ఫైరింజన్ ప్రమాద స్థలానికి వేళ్తే మరో చోట ప్రమాదం సంభవించినప్పుడు మంటలను ఆర్పేందుకు ఫైరింజన్ ఉండదు, అప్పటికే తీవ్రస్థాయిలో ఆస్థి నష్టం, కొన్ని సందర్భలలో ప్రాణ నష్టం సంభవించే అవకాశం ఉంటుంది. ఇచ్చోడ నుంచి చుట్టూ ప్రక్కల మండలాల్లో ఎక్కడైనా అగ్నిప్రమాదం సంభవిస్తే మంటలను ఆర్పేందుకు ఫైరింజన్ రావాలంటే కనీసం 30 నిమిషాల నుంచి 45 నిమిషాలు పడుతుంది. ఇటీవల ఇలాంటి సంఘటనలు కూడ జరిగాయి, అదే మండలానికి ఒక ఫైరింజన్ అందుబాటులో ఉంటే మండలంలో ఏ ప్రాంతంలో అగ్నిప్రమాదం సంభవించిన ఐదు, పది నిమిషాల్లో చేరుకోవచ్చు మంటలను ఆదిలోనే ఆర్పీ వేయవచ్చు, బాధితునికి నష్టం తక్కువలో ఉంటుందని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.

**ఇల్లు దగ్ధం రూ.5లక్షల ఆస్థి నష్టం**

నేరడిగొండ మండలంలోని లక్కంపూర్ గ్రామంలో మే 4న శనివారం ఉదయం 8:06 నిమిషాలకు షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లుకు అగ్ని ప్రమాదం జరిగింది. కుటుంబ యజమాని పెందూర్ జనక్ గమనించి, స్థానికుల సాయంతో 8:13నిమిషాలకు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు, అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్‌తో ఘటన స్థలానికి 8:54నిమిషాలకు చేరుకున్నారు. అప్పటికే పూర్తి స్థాయిలో సిమెంట్ గోడలు తప్ప ఇంట్లో ఉన్న సామాగ్రీ, డబ్బులు, నగలు, విలువైన పత్రాలు దగ్ధం అయినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.



ఒకే ఫైరింజన్‌తో అగ్నిమాపక శాఖ కార్యాలయం

సుమారుగా రూ.5లక్షల విలువైన ఆస్థి నష్టం జరిగినట్లు ఆవేదన వ్యక్తం చేశారు.

**ఫైరింజన్ వెళ్లే లోపే కాలి బూడిద**

బోథ్ మండలంలోని పాట్నాపూర్ గ్రామానికి చెందిన రైతు కిసాన్‌కు చెందిన చెనులో 3 ఎకరాల భూమిలో మక్కా వేశారు. ఇంకో వారం రోజుల్లో కోయడాని రైతు సిద్ధమై ఉండగా, పంట చెనుకు అగ్నిప్రమాదం సంభవించింది. ఈ సంఘటన ఏప్రిల్ 8న మధ్యాహ్నం 12:40 నిమిషాలకు చోటు చేసుకుంది. స్థానికులు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఇచ్చోడ నుంచి పాట్నాపూర్‌కు 36కిలోమీటర్లు ఉంటుంది. సంఘటన స్థలానికి చేరుకోవడానికి 56 నిమిషాలు పట్టింది. ఫైరింజన్ వెళ్లేలోపే చేతికి వచ్చిన పంట కాలి బూడిద అయినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

**అగ్నిమాపక కేంద్రానికి భూమిపూజ..**

2018 శాసన సభ ఎన్నికల అనంతరం బోథ్ మండల కేంద్రంలోని పిప్పల్‌ధరి వెళ్లే రోడ్డు వైపు గల ప్రభుత్వ భూమిలో అగ్నిమాపక కేంద్ర నిర్మాణనికి అప్పటి ప్రజా ప్రతినిధులు, అధికారులు కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేశారు, నాలుగైదు సంవత్సరాలుగా అగ్నిమాపక కేంద్ర ఏర్పడి ఫైరింజన్ అందుబాటులో ఉంటుందని, మండల ప్రజలు ఆశా తో ఎదురు చూస్తున్నా, పనులు మాత్రం ఆదిలో ఉన్నాయి. అగ్నిప్రమాదం సంభవించిన సందర్భంలో మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ఏ సమయంలోనైనా అప్రమత్తంగా ఉంటున్నాం



మా పరిధిలో 6 మండలాలు వస్తాయి. ఇచ్చోడ, బజార్‌హత్నూర్, బోథ్, నేరడిగొండ, గుడిహత్నూర్, సిరికొండ ఎక్కడ ఏ సమయంలో సంఘటన జరిగిన సమాచారం అందిన వెంటనే ఆలస్యం చేయకుండా ప్రమాదం జరిగిన స్థలానికి వెళ్తున్నాం. కొన్ని మండలాలకు కనీసం ప్రయాణం 40నుంచి 50 నిమిషాలు పడుతోంది. ఆ సమయంలో కొంత మేర నష్టం జరుగుతోంది. వీలైనంత త్వరలో సంఘటన స్థలానికి వెళ్లి ఆస్థి, ప్రాణ నష్టం జరగకుండా ప్రయత్నం చేస్తున్నాం.

**- ఇచ్చోడ అగ్నిమాపక అధికారి రామారావు**

# మూఢనమ్మకాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- నేటి పిల్లలే రేపటి భవిష్యత్
- జేవీవీ శిక్షణ ముగింపు కార్యక్రమం
- హాజరైన కలెక్టర్ రాజర్షిషా



ముగింపు శిక్షణ శిబిరంలో విద్యార్థులతో జిల్లా కలెక్టర్ రాజర్షిషా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమాజంలో పెరుగుతున్న మూఢనమ్మకాల పట్ల అప్రమత్తంగా ఉండాలని శాస్త్రీయ వైఖరి ద్వారానే మూఢనమ్మకాల నుంచి బయటపడచ్చని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. నేటి పిల్లలే రేపటి భవిష్యత్ అని అన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గత వారం రోజులుగా వేసవి ఉచిత శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. మంగళవారం శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని పట్టణంలో డైట్ కళాశాలలో ఏర్పాటు చేయగా దీనికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా విద్యార్థులచే సైన్స్ ప్రదర్శన చేపట్టగా, ఆసక్తిగా తిలకించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సైన్సు లేని జ్ఞానం అసంపూర్ణమని, మన జ్ఞానం పూర్తి కావాలంటే అది సైన్సుతోనే సాధ్యమని అన్నారు. సమాజంలో మూఢనమ్మకాలను నిరోధించడంలో శాస్త్రీయ వైఖరిని పెంపొందించడంలో జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషిని అభినందించారు. సైన్సులో మానవత్వం ఉండాలని, సైన్స్ ఇన్నోవేషన్లు ఇమ్యూనిటీ కోసమే ఉపయోగపడాలన్నారు. చిన్న ఇన్నోవేషన్‌తో రైతు సమస్యలు, వ్యాధుల సమస్యలు, ప్రతినిత్యం మనం ఎదుర్కొనే సమస్యలు కూడా సైన్స్ ద్వారానే పరిష్కారం చేసుకోవచ్చన్నారు. సైన్స్ ద్వారా వచ్చిన వ్యాక్సిన్‌తోనే మనం నేడు ఆరోగ్యంగా ఉన్నామన్నారు. వ్యాక్సిన్ ద్వారా పిల్లలు వ్యాధుల నుంచి కాపాడబడుతున్నారన్నారు. కొందరు సైన్సుని పక్కనపెట్టి మూఢనమ్మకాలను నమ్ముతున్నారని వీటివల్ల వ్యాక్సిన్ తీసుకోవడం లేదని, డాక్టర్ వద్దకు వెళ్లడం లేదన్నారు.

**మన దగ్గరే మూఢనమ్మకాల సమస్య ఎక్కువుంది**

మన జిల్లాలో ఈ మూఢనమ్మకాల సమస్య ఎక్కువగా ఉందని తెలిపారు. పిల్లలే పేరెంట్స్‌కు మూఢనమ్మకాలు నమ్మవద్దని చెప్పి సైన్స్ గొప్పతనాన్ని వారికి తెలియజేయాల్సిన బాధ్యత పిల్లలదేనని అన్నారు. పిల్లలు తమ చుట్టూ ఉన్న స్నేహితులు, బంధువులు, తల్లిదండ్రులకు సైంటిఫిక్ టెంపర్ పెంచేలా కృషి చేయాలన్నారు. దాని ద్వారా విజ్ఞాన సమాజం ఏర్పడుతుందని, ఇందుకు మనందరం కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఓ ప్రణీత, సెక్టోరల్ అధికారి నారాయణ, డిస్టిక్ సైన్స్ అధికారి రఘు రమణ, జనవిజ్ఞాన వేదిక అధ్యక్షప్రధాన కార్యదర్శులు బెదోడ్కర్ సంతోష్ కుమార్, నూతుల రవీందర్‌రెడ్డి, జిల్లా బాధ్యులు వీరన్న, ఉమాకాంత్, శ్రీధర్ బాబు, మెస్రం రాజు, శ్రీనివాస్, లింగారెడ్డి, గంగన్న, సంజీవరెడ్డి, ఆత్రం సంతోష్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వాన

- పల్లి( కే), పల్లి( బి), గ్రామాల్లో వడగండ్లు



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని పల్లి(కే), పల్లి(బి), గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వాన కురిసింది. ఆకాశం మేఘావృతం కాకుండానే ఒకేసారి ఈదురు గాలులు వీచి వడగండ్ల వాన కురువడంతో ఆయా గ్రామాల గ్రామస్తులు ఆశ్చర్యనికి లోనయ్యారు. ఇదేం కాలమంటూ చర్చించుకున్నారు. రబీ పంటలు దాదాపు 90 శాతం వరకు ఇండ్లలోకి రావడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఎలాంటి పంటనష్టం జరగకపోవడంతో ఆనందం వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో రైతుల ప్రజలు రానున్న ఖరీఫ్ పంటల్లో వర్షాలు కురుస్తాయా లేదా అని ప్రశ్నించుకుంటున్నారు. గత సంవత్సరం కూడా మే నెలలో కప్పరదేవి, ఉమ్రి, కోసాయి, దేగామ గ్రామాల్లో వర్షం కురవడంతో మండల కేంద్ర సమీపంలోని పెద్దవాగు వంతెన పైనుంచి వర్షం నీరుపారడంతో రాకపోకలు నిలిచిపోయిన విషయం తెలిసిందేనని అన్నారు.

## ఒక సారి ఎంపీగా ఆశీర్వదించండి

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ



నవతెలంగాణ-నార్నూర్

ఒక సారి ఎంపీగా ఆశీర్వదించాలని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ ప్రజలను కోరారు. మంగళవారం మండలంలోని పూసిగూడ గ్రామంతో పాటు ఆయా గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశం సురక్షితంగా, సుభిక్షంగా ఉండాలంటే త్యాగాల కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. పదేండ్ల బీజేపీ, బీఆర్ఎస్ పాలనలో ఆదివాసీ గిరిజన గూడాల్లో ఎలాంటి అభివృద్ధి జరగలేదని అన్నారు. ఇందిరమ్మ ఇల్లు, పోడు భూములకు పట్టాలు కాంగ్రెస్ హయాంలోనే వచ్చాయని పేర్కొన్నారు. మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆదివాసీ, గిరిజన గూడాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా తనను ఆదరించి హస్తం గుర్తుకు ఓటు వేసి, గెలిపిస్తే మీ గొంతుకగా ఈ ప్రాంత అభివృద్ధికి ఢిల్లీలో గళం విప్పి నిధులు, నియామకాలు తీసుకువస్తానని తెలిపారు. ఆమె వెంట ప్రచారంలో పార్టీ మండల అధ్యక్షుడు దేవ్‌రావ్ లోఖండే, మాజీ జెడ్పీటీసీ హేమలత, బ్రీజూలాల్ ఉన్నారు.

# ఆదర్శం.. ఈ ఆదివాసీ దంపతులు..

- రూ.10 లక్షలతో బెంగళూరు బేకరి ఏర్పాటు
- ఐటీడీఏ సాయం కోసం ఎదురు చూపులు



బేకరి నడుపుతున్న గిరిజన మహిళ



బేకరి ఐటెమ్స్ తయారు చేస్తున్న గిరిజన యువకుడు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఎవరో వస్తారు.. ఏదో చేస్తారు.. ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎదురు చూడలేదు.. ఉత్తర భారత దేశం నుంచి గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి ఇక్కడ స్వీట్ షాప్‌లు, హోటళ్లు పెట్టి వ్యాపారంలో స్థిర పడుతున్నారు. ఇక్కడ పుట్టిన తాము సైతం వ్యాపారంలో రాణించాలని పట్టుదలే ఆ ఆదివాసీ దంపతులకు విజయాన్ని అందించింది. వారెవరో కాదు మన ఏజెన్సీ ప్రాంతం బజార్‌హత్నూర్ మండలంలోని మారుమూల గ్రామమైన రాంపూర్ గోండు గూడెనికి చెందిన గిరిజన దంపతులు దుర్వ వనితా లక్ష్మణ్.

**రూ.10 లక్షల పెట్టుబడితో బెంగళూరు బేకరి షాపు ఏర్పాటు..**

జిల్లాలో ఆదివాసులు నిర్వహిస్తున్న మొట్టమొదటి బేకరి షాపు ఇది. గత పది సంవత్సరాల కింద పొట్ట కూటి కోసం పొరుగు రాష్ట్రమైన కర్నాటక లోని బెంగళూరుకు వెళ్లి ఓ హోటల్లో పనిచేశారు. అక్కడ నుంచి కరీంనగర్ జిల్లాలోని ఓ బేకరిలో పనిచేశారు. పది సంవత్సరాలుగా ఒకే యజమాని వద్ద పనిచేయడంతో రూ.20 వేల వరకు జీతం ఇచ్చేవాడని తెలిపారు. వాళ్లు చేస్తున్న ఎగ్గ్ పాఫ్, చికెన్ పాఫ్‌తో వివిధ రకాల స్వీట్లను తయారు చేయడం నేర్చుకున్నారు. వారి వద్ద పని చేస్తూ రూ.8 లక్షల వరకు పొదుపు చేశారు. మనమే ఇటువంటి షాపు ఎందుకు పెట్టుకోకూడదని ఆ దంపతులకు ఆలోచన చేశారు. ఆ ఆలోచనే వారి వ్యాపారానికి పునాది అయిందన్నారు. ప్రస్తుతం మండల కేంద్రంలో పది లక్షల వరకు పెట్టుబడి పెట్టి బెంగుళూరు బేకరి పేరిట కార్పొరేట్ స్థాయి హోటల్‌ను నడుపుతున్నారు. ఇక్కడ పలు రకాల స్వీట్లు, బేకరీలను సొంతంగానే తయారు చేస్తూ వ్యాపారంలో రాణిస్తున్నారు. తాము సైతం తక్కువగా లేమంటూ మార్వాడీ, రాజస్థానీలకు ధీటుగా వ్యాపారం నడుస్తుండటంతో పలువురి మన్ననలు పొందుతున్నారు. ప్రస్తుతం నెలకు ఒక లక్ష వరకు సంపాదిస్తున్నామన్నారు. తమ వ్యాపారానికి ఐటీడీఏ అధికారులు ఆర్థిక సాయం అందించాలని ఆ ఆదివాసీ దంపతులు కోరుతున్నారు.

### తమ వ్యాపారానికి ఐటీడీఏ చేయూత నివ్వాలి

**- దుర్వ లక్ష్మణ్ బేకరి నిర్వాహకుడు**



ఆదివాసీ తెగలైన తమకు ఐటీడీఏ ద్వారా స్వయం ఉపాధి కింద ట్రైకార్ వంటి పథకాల కింద ఆర్థిక సాయం అందించాలి. ప్రభుత్వం తోడ్పాటు అందిస్తే వ్యాపారంలో మరింత ముందుకు సాగుతాం.

## రోగులకు పండ్లు పంపిణీ

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ జానీమియా 3వ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం స్థానిక కమ్యూనిటి హెల్త్ సెంటర్‌లోని రోగులకు పండ్లు, బిస్కట్, జ్యూస్ ప్యాకెట్లతో పాటు మంచినీటి బాటిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ ఛైర్మన్ దస్తగిరి మాట్లాడుతూ పట్టణ ప్రజలకు జానీమియా చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ స్వామిశెట్టి రాజేందర్, కౌన్సిలర్లు పిర్సింగుల జయచందర్, ఎల్లేష్, నాయకులు వనమాల రాము, మహబూబ్, వివి ప్రసాద్, కోనేరు ఫణి, జానిమియా కుమారులు జాకీర్, హబీబ్, కాలనీవాసులు సాయి, శివదర్శన్, బబ్లు, శ్రీకాంత్, ప్రతాప్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన బీఎస్పీ నాయకులు

నవతెలంగాణ-చింతలమానేపెల్లి



మండల కేంద్రంలోని బీఎస్పీ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా సిర్పూర్ నియోజకవర్గం అధ్యక్షులు రావి శ్రీనివాస్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మొదటిసారిగా మహిళ అభ్యర్థికి ఎంపీ టికెట్ ఇచ్చిందన్నారు. ఆత్రం సుగుణను అధిక మెజార్టీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు మారుతి, నాయకులు శేఖర్, మహేష్, మేకల ప్రవీణ్, రౌతు శంకర్, వార్డ్ మెంబర్ సతీష్, జాడి లక్ష్మి మీరాబాయి, గీత, కమల బాయి, ధర్షిణి, నిర్మల, రాజేంద్ర ప్రసాద్, శ్రీకాంత పాల్గొన్నారు.

## శాంతియుత ఎన్నికలకు పార్టీలు సహకరించాలి

- కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించడానికి అన్ని రాజకీయ పార్టీల సహకరిస్తేనే సాధ్యమవుతుందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదుల కోసం సి-విజిల్ యాప్ ఉందన్నారు. సభలు సమావేశాలు అనుమతుల కోసం 48 గంటలు ముందుగా వివిధ అప్లికేషన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని వివరించారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాటు చేశామని, ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే పార్టీల ప్రతినిధులు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ఆర్డీఓ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవచ్చని, ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 వరకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, ఆర్డీఓ లోకేశ్వరరావు, తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్పాండే, ఎన్నికల సూపరింటెండెంట్ మధుకర్, పార్టీల ప్రతినిధులు జీవన్ పాల్గొన్నారు.

## రైల్వే ప్రయాణీకులకు మజ్జిగ పంపిణీ



నవతెలంగాణ-కాగజ్‌నగర్

రైల్ యాత్రి సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో మజ్జిగ పంపిణీ చేశారు. ఎండలు మండుతున్నందున రైల్వే ప్రయాణీకులకు ఊరట కోసం ఏర్పాటు చేసిన ఈ పంపిణీ కేంద్రాన్ని సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు సందర్శించి నిర్వాహకులను అభినందించారు. సుమారు 2వేల మంది ప్రయాణీకులకు ఈ మజ్జిగ పంపిణీ చేసినట్లు నిర్వాహకులకు తెలిపారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు ప్రయాగ్ తివారి, పవన్ బల్దేవా, పురుషోత్తం జావర్ పాల్గొన్నారు.

## ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలి



నవతెలంగాణ-రెబ్బెన

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని మండల నాయకులు కోరారు. మంగళవారం మండలంలోని గంగాపూర్ గ్రామంలో ఉపాధిహామీ పని చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు ప్రజాస్వామ్య పరిరక్షణపై రౌండ్ టేబుల్ సమావేశం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రమాదంలో ప్రజాస్వామ్యం దాని పరిరక్షణపై బుధవారం జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్‌లో సాయంత్రం 4 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలంగాణ జన సమితి ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి బాబన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం హాజరు కానున్నట్లు తెలిపారు. ప్రజాస్వామికవాదులు, ప్రజాసంఘాల నేతలు, అభ్యుదయవాదులు హాజరు కావాలని కోరారు.

## ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-కెరమెరి

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం మండలంలోని కరంజివాడ గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న పని ప్రదేశాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కూలీల సంఖ్యను పెంచాలని, ప్రతి కూలీకి పని కల్పించాలని ఈజీఎస్ సిబ్బంది కి సూచించారు. ఎంపీడీఓతో పాటు ఏపీఓ మల్లయ్య, టెక్నికల్ అసిస్టెంట్ మహేందర్ పాల్గొన్నారు.

# ప్రచారంలో వేగం పెంచిన పార్టీలు

- ఆసిఫాబాద్‌లో ఆదివాసీ, పల్లె ఓటర్లే లక్ష్యం
- ప్రధాన నాయకుల రాకతో పెరిగిన ప్రచార వేడి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో ప్రధాన పార్టీలు వేగాన్ని పెంచాయి. జిల్లాలోని మండలాలు, గ్రామాల్లో ప్రచారం జరిగేలా నాయకులు ప్రణాళికలు రూపొందించారు. గ్రామ స్థాయి నాయకుని వద్ద నుండి జిల్లా స్థాయి నాయకుల వరకు ప్రచారంలో పాల్గొంటూ ఓటర్లను ప్రసన్నం చేసే పనిలో వారి వేగాన్ని మరింత పెంచారు.

**వేగాన్ని పెంచిన ప్రధాన పార్టీలు**

ఎన్నికల పోలింగ్ సమయం దగ్గర పడుతున్న వేళ ప్రధాన పార్టీలు తమ వేగాన్ని పెంచాయి. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపెల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్, బీఆర్ఎస్ ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి జిల్లాలో ప్రచార బాధ్యతలు మోస్తున్నారు. కింది స్థాయి శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ప్రచారం కొనసాగిస్తున్నారు. బీజేపీకి సంబంధించి కాగజ్‌నగర్ నియోజకవర్గంలో జిల్లా అధ్యక్షునితో పాటు ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ప్రచారం చేస్తుండగా, ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఆసిఫాబాద్ జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్ ఆసిఫాబాద్ నియోజకవర్గ ప్రచార బాధ్యతలు నిర్వహిస్తుండగా కోనేరు కోనప్ప, రావి శ్రీనివాస్ కాగజ్‌నగర్ ప్రాంతాల్లో ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్‌కు సంబంధించి ఆసిఫాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆధ్వర్యంలో ప్రచారం చేస్తుండగా సిర్పూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ దండే విఠల్ ప్రచారం నిర్వహిస్తున్నారు.

**ఆదివాసీ, పల్లె ఓటర్లే లక్ష్యం**

జిల్లా ఎక్కువగా ఆదివాసీ జనాభాతో మమేకమై ఉంటుంది. జిల్లాలో 15 మండలాలు ఉండగా ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని 8 మండలాల్లోని సిర్పూర్ (యు), లింగాపూర్, జైనూర్, కెరమెరి, వాంకిడి, తిర్యాని మండలాల్లో 80 శాతం ఆదివాసీ జనాభా ఉంటుంది. సిర్పూర్ నియోజకవర్గంలోని ఏడు మండలాలు బెజ్జూర్, చింతలమానేపల్లి, పెంచికల్‌పేట్, సిర్పూర్(టి), కౌటాల, దహెగాం మండలాల్లో ఆదివాసీలు, పల్లె ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పల్లె ప్రాంతాల్లో 81 శాతం కంటే ఎక్కువగా పోలింగ్ కావడంతో నాయకులు వాటిపైనే ఎక్కువగా దృష్టి కేంద్రీకరించి విస్తృతంగా పర్యటిస్తున్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**ప్రచారంలో ప్రధాన నాయకులు**

ఎన్నికల ప్రచారంలో ఇప్పటికే జిల్లాకు కాంగ్రెస్ తరపున రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రచారం చేసి వెళ్లగా, బీజేపీ నుండి కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ కూడా అదే బాటలో ముఖ్య నేతను తీసుకురావడానికి ప్రయత్నం చేస్తుంది. దీంట్లో భాగంగా ఈ నెల 9న జిల్లా కేంద్రానికి మాజీ మంత్రి కేటీఆర్ పర్యటన ఖరారు కాగా ఆయనతో జిల్లా కేంద్రంలో రోడ్ షో లేదా బహిరంగ సభకు ప్రణాళిక రూపొందిస్తుంది.

## బీజేపీ కబంధహస్తాల నుండి దేశాన్ని కాపాడాలి

- సీపీఐ(ఎం) ఏరియా కమిటీ కార్యాదర్శి దినకర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

దేశ ఔన్నత్యాన్ని చాటే రాజ్యాంగ మూల సూత్రాలు కాలరాసేలా ప్రవర్తిస్తున్న బీజేపీ కబంధహస్తాల నుండి దేశాన్ని కాపాడాలని సీపీఐ(ఎం) ఏరియా కమిటీ కార్యదర్శి దుర్గం దినకర్ అన్నారు. జిల్లా కార్యాలయంలో దేశ పరిస్థితులు తెలిసే రచించిన 'బిజెపి బంధీఖానా నుండి దేశాన్ని విముక్తి చేద్దాం' అనే బుక్ లెట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీజేపీ మతోన్మాదాన్ని ఎండగట్టేలా ఓటర్లు వ్యవహరించాలని సూచించారు. యువతకు ఉపాధి కల్పించాల్సిన కేంద్ర ప్రభుత్వం మతోన్మాదాన్ని వారిలో నింపుతుందని ఆరోపించారు. దేశంలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాల నేతల ఇండ్లపై ఈడీ, ఐటీ దాడులు చేస్తూ భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మేధావులపై ఉపా చట్టాన్ని ప్రయోగిస్తున్నారన్నారు. బీజేపీ ప్రభుత్వం త్రిశూల తంత్రాన్ని పాటిస్తూ దేశంలోని రక్షణ, విద్యా, వైద్య వ్యవస్థపై దాడులు చేస్తూ కార్పొరేట్‌లకు అప్పగిస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని అప్పుడే బడుగు బలహీన వర్గాల డిమాండ్లు నెరవేరుతాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) ఏరియా కమిటీ నాయకులు గోడిసెల కార్తీక్, గేడం టికనంద్, తిరుపతి, నిఖిల్, మాలశ్రీ, శ్రావణి, శ్రీకాంత్, సతీశ్, భీమ్‌రావు, పురుషోత్తం పాల్గొన్నారు.



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

## రాజ్యాంగాన్ని మార్చేయత్నం చేస్తున్న బీజేపీకి బుద్ధికి చెప్పాలి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

రాజ్యాంగాన్ని యత్నం చేస్తున్న బీజేపీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ నాయకులు, మాజీ జడ్పీ చైర్మన్ సిడాం గణపతి అన్నారు. మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం పది సంవత్సరాలు పాలించి ప్రజలకు ఏమీ చేయలేదని, బీజేపీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చి మనధర్మశాస్త్రం ప్రవేశపెట్టి దేశాన్ని హిందుత్వ దేశంగా మారుస్తారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాకు తీరని అన్యాయం చేసిందని, ఐటీడీఏను బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసి గిరిజనులకు అన్యాయం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ బడుగు బలహీన వర్గాల పార్టీ అని, కాంగ్రెస్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ లహన్‌రాజ్, కడాల నారాయణ, రాంటెంకి సురేష్, సుధాకర్, తిరుపతి, భక్తు రాంచందర్, భూజంగరావు, సకారాం, అశోక్ పాల్గొన్నారు.

## సభ్యత్వం లేని నాయకులకు టికెట్ ఇచ్చారు

- ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు
- ధైర్యం లేనివారు వెళ్లిపోయారు
- అధికారం శాశ్వతం కాదు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి

నవతెలంగాణ-బెజ్జూరు

కాంగ్రెస్, బీజేపీ పార్టీలో సభ్యత్వం లేని నాయకులకు టికెట్ ఇచ్చారని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. అధికారం కోల్పోగానే కొందరు నాయకులు ధైర్యం లేక వారు పార్టీని వదిలారని, నిజమైన కార్యకర్త గులాబి కండువా కిందనే ఇంకా ఉన్నారని, వారి ధైర్యంతోనే పోరాటం చేస్తామన్నారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు నెరవేర్చడంలో విఫలమయ్యారన్నారు. రైతుబంధు విషయంలో కేసీఆర్ ప్రశ్నిస్తే రైతుబంధును వేశారని, కళ్యాణలక్ష్మి పథకంలో ఒక్క తులం బంగారం ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇన్ని పెళ్లిళ్లు జరిగిన తులం బంగారం దొరకలేదా అని ఎద్దేవ చేశారు. వృద్ధాప్య పింఛన్ రూ.నాలుగు వేలు ఇస్తామని ఇప్పటికీ అదే రూ.రెండు వేలు కొనసాగిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటే తనను ఎంపీ అభ్యర్థిగా గెలిపించాలని కోరారు. రాముడి పేరుతో ఓట్లు అడుగుతున్న బీజేపీకి బుద్ధి చెప్పాలన్నారు. యిఱమురం భీం జిల్లాను ఎత్తివేసే ప్రయత్నం చేస్తుందని, దీనిని ఎట్టి పరిస్థితిలో జిల్లాను ఎత్తివేయకుండా పోరాటం సాగిస్తామన్నారు. భీం స్ఫూర్తితో ప్రతి కార్యకర్త ముందుకు నడవాలని, ప్రతి ఇంటికెళ్లి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లాలన్నారు. రాష్ట్రంలో 12 ఎంపీ స్థానాలు ఖచ్చితంగా గెలుస్తామని, ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్సీ దండె విఠల్ మాట్లడుతూ పార్టీకి నాయకులు లేకున్నా కార్యకర్తల బలం ఉందని, రాబోయే ఎన్నికల్లో ఆత్రం సక్కు ఎంపీగా గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. తమ హయాంలో ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చామని, వాటన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం బందు చేస్తుందన్నారు. పరిపాలన సౌలభ్యం కోసం ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలనే ఉద్దేశ్యంతో జిల్లాలను ఏర్పాటుచేశామని, నూతన జిల్లాలను ఎత్తివేసే కుట్రకు కాంగ్రెస్ ప్రభుత్వం పూనుకుందని ఆరోపించారు. అనంతరం బీఎస్పీ, వివిధ పార్టీల నుండి సుమారు 200 మంది కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. వారందరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు సోయం చిన్నయ్య, ఉమామహేష్, దుబ్బుల జనార్ధన్, సామల రాజన్న, రంగు సురేష్ గౌడ్, సూర్ల ఇస్తారి, నిట్టూరి శ్రీశైలం, సిడాం జ్యోతి, డోకె రాజన్న పాల్గొన్నారు.

## అదుపుతప్పి బోల్తాపడిన కూరగాయల వ్యాన్



నవతెలంగాణ-రెబ్బెన

కూరగాయలు తీసుకెళ్తున్న మినీ వ్యాను అదుపుతప్పి బోల్తా పడిన సంఘటన మండలంలోని రాంపూర్ గ్రామ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కాగజ్‌నగర్‌కు వెళ్లే రోడ్డు మార్గంలో రాంపూర్ గ్రామ సమీపంలో కూరగాయల లోడుతో వెళ్తున్న మినీ వ్యాన్ తెల్లవారు జామున అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలైనట్టు తెలిపారు.

## ఆత్రం సుగుణను గెలిపించాలి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-దహెగాం

లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి భాగస్వామి కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని సీపీఐ(ఎం) సిర్పూర్ నియోజకవర్గ కన్వీనర్ ముంజం ఆనంద్ పిలుపు నిచ్చారు. మంగళవారం మండలకేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్టు) విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల కోసం పేద ప్రజల పక్షాన, కార్మికుల, వ్యవసాయ కార్మికుల, కూలీల పక్షాన ఎర్రజెండా నిలుస్తుందన్నారు. భూ పోరాటాలు చేసి మండలంలో దాదాపు 1200 ఎకరాలు పేదలకు పంచిన చరిత్ర సీపీఐ(ఎం)దని అన్నారు. యూపీఏ-1 ప్రభుత్వంలో ఉపాధిహామీ, అటవీ హక్కుల, సమాచార హక్కు, విద్యా హక్కు చట్టాలాంటివి పోరాడి సాధించామన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. చరిత్రను వక్రీకరిస్తు, ప్రశ్నించే వాళ్లను జైల్లో పెడుతున్నారని, చివరకు ఢిల్లీ, జార్ఖండ్ ముఖ్యమంత్రులను సైతం జైల్లో పెట్టి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందన్నారు. రామ మందిరాన్ని చూపెట్టి ఓట్లు అడగడం ఏంటని ఆలోచించాలన్నారు. మోడీ హయాంలో ఒక్క కొత్త ఆస్పత్రి ఏమైనా నిర్మించారా అని ప్రశ్నించారు. బీజేపీ నరేంద్రమోడీని చూసి ఓటు వెయ్యమని అడుగుతున్నారని, కానీ అభివృద్ధిని చూసి ఓటు వేయ్యాలని పిలుపునిచ్చారు. ఎర్రజెండా అధికారంలో ఉన్న కేరళలో అభివృద్ధి, విద్యాభివృద్ధి జరిగిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యవర్గ సభ్యులు కోట శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు నేర్పల్లి అశోక్, దిగిడ బక్కన్న, జిల్లా నాయకులు చాపిలె సాయికృష్ణ, మండల నాయకులు నల్లి దామోధర్, దూల లక్ష్మీ, శ్యాగం కమల, మెట్‌పల్లి రాజేశ్వరి, నల్లి అశోక్, నైతం విమల పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం సిర్పూర్ నియోజకవర్గ కన్వీనర్ ఆనంద్

## బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులు అభ్యర్థి తరపున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండలంలోని గుండి గ్రామంలో ప్రచారం నిర్వహించిన నాయకులు మాట్లాడుతూ ఆదివాసీ ముద్దుబిడ్డ, స్నేహశీలి ఆత్రం సక్కుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించి మన ప్రాంత అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలో వచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌కి, మతం పేరిట రాజకీయాలు చేస్తున్న బీజేపీ పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. రైతు రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ఇప్పటికి వైఖరిని చెప్పడం లేదన్నారు. డిసెంబర్ తొమ్మిది పోయి ఆగస్టు వచ్చిందన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కూడా ఇవ్వలేదని ఆరోపించారు. ప్రజలు ఈ విషయాలను గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు జబరి రవీందర్, పీఏసీఎస్ చైర్మన్ అలిబిన్ అహ్మద్, మాజీ సర్పంచ్లు అరుణ, బలారం నాయక్, బాబురావు, భీమేష్, లక్ష్మీనారాయణ, మాజీ వార్డు సభ్యులు మోహన్, మల్లేష్, ప్రవీణ్, నాయకులు సాలం లక్ష్మణ్, రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంగళగిరిలో స్థానిక టీడీపీ నాయకుల ప్రచారం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఆంధ్రప్రదేశ్‌లోని మంగళగిరి నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి నారా లోకేష్ తరపున సిర్పూరు నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేతలు మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఆ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు జి.ఆనంద్ ఆధ్వర్యంలో మంగళగిరికి వెళ్లిన నాయకులు అక్కడ ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ చంద్రబాబు సీఎం అయితేనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఐదేండ్ల రాక్షసపాలనను తరిమికొట్టేందుకు ఇక్కడి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రచారం కోసం తరలిన వారిలో ఆ పార్టీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఆత్మారాం, నాయకులున్నారు.

## 13న ఓటు హక్కును వినియోగించుకోవాలి

నవతెలంగాణ-జన్నారం




మే 13న ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని మంచిర్యాల జిల్లా డీఆర్డీఏ పీడీ కిషన్ కోరారు. మంగళవారం మండలంలోని పోన్కల్ గ్రామ శివారులో చెరువు పనులు చేస్తున్న జాతీయ ఉపాధి హామీ కూలీలతో ఆయన మాట్లాడారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూల స్తంభం లాంటిదని, మే 13న జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలోఅడిషనల్ డీఆర్డీఓ దత్తారం, ఎంపీడీఓ శశికళ, జేడీఎం రామచందర్, ఎంపీఓ రమేష్, ఏపీఓ రవీందర్, ఈసీ విలాస్, టెక్నికల్ అసిస్టెంట్లు ఫీల్డ్ అసిస్టెంట్లు జాతీయ ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## చెక్ పోస్ట్ వద్ద తనిఖీలు.. నగదు సీజ్

నవతెలంగాణ-కాసిపేట



కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సోమగూడెం చెక్ పోస్ట్ వద్ద పోలీసుల తనిఖీల్లో ఎటువంటి ఆధారం లేకుండా తరలిస్తున్న నగదును స్వాధీనం చేసుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్ట్ వద్ద కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఎటువంటి ఆధారాలు లేకుండా రాజంపేటకు చెందిన చుంచు రాజమోళి వద్ద రూ.88,000, మహారాష్ట్రకు చెందిన జుబేర్ ఖాన్ వద్ద రూ.64,500 నగదు తరలిస్తుండగా స్వాధీనం చేసుకొని మొత్తం రూ.1,52,500 లక్షలను పోలీసులు సీజ్ చేశారు. సీజ్ చేసిన నగుదును తదుపరి చర్యల నిమిత్తం ఎస్ఎస్ఈ టీంకు అప్పగించినట్లు ఎస్ఐ వివరించారు.

# బీభత్సం సృష్టించిన వడగళ్ల వాన

- నిలిచిన విద్యుత్ సరఫరా
- తడిసిన ధాన్యం, నేలకొరిగిన వరి పైరు
- నేల రాలిన మామిడి పంట
- వేలాల-పొనూర్ మధ్య పడిపోయిన చెట్లు


జైపూర్ : వేలాల -పొనూర్ మధ్య రోడ్డుపై విరిగిపడ్డ భారీ వృక్షం

నవతెలంగాణ-జైపూర్

జిల్లాలో వడగళ్ల వాన బీభత్సంగా సృష్టించింది. మందమర్రి, జైపూర్ మండలాల్లో వరి ధాన్యం తడిసిపోగా మామిడి పంట నేల రాలింది. ప్రధానంగా జైపూర్ మండలం వేలాల, పొనూర్, శివ్వారం గ్రామాల మధ్య వర్ష ప్రభావం చూపింది. మంగళవారం మధ్యాహ్నం మొదలైన వాన రెండు గంటల పాటు ఏకధాటిగా కురిసింది. సుమారుగా 20 నిమిషాల పాటు రాళ్లతో కూడిన వర్షంతో వరిధాన్యం తడిసి ముద్దయ్యింది. కోత దశలో ఉన్న వరి పైరు నేలకొరిగింది. మామిడి పంట నేలరాలింది. ఊహించని విధంగా కురిసిన వర్షం కారణంగా సాగు చేసిన పంటలకు తీవ్రంగా నష్టం జరిగిందని వేలాల, శివ్వారం, పొనూర్ శివారు రైతులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. కొతకొచ్చిన వరి పైరు పడిపోవడంతో పంట దిగుబడికి తీవ్రంగా నష్టం జరిగిందని బాధిత రైతులు వాపోతున్నారు. రెండు గంటల పాటు ఏకదాటిగా కురిసిన రాళ్ల వానతో వందల ఎకరాల్లో సాగు చేసిన వరితో పాటు ఇతర పంటలను నష్టపోవల్సి వచ్చిందని పేర్కొంటున్నారు. గాలి దుమారంతో కూడిన రాళ్ల వానకు మామిడి చెట్లు విగిపోగా కాయలు నేలరాలి రాళ్ల తాకిడికి పలిగిపోవడంతో మామిడి పంటను మార్కెట్‌కు తరలించే వీలులేకుండా పోయిందని శివ్వారం శివారు రైతు శ్రీనివాస్ గౌడ్ వాపోయాడు.


గాలి వానకు నేల రాలిన మామిడి పంట

**రోడ్డుపై పడ్డ చెట్లు.. నిలిచిన రాకపోకలు**

విపరీతమైన గాలిదుమారంతో వేలాల-పొనూర్ మధ్య చెట్లు విరిగి రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. వాహణాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పొనూర్ గ్రామ పంచాయతి పరిధిలో విద్యుత్ లైన్‌పై చెట్లు పడిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వేలాల, శివ్వారం, పొనూర్ గ్రామాల మధ్య కేంద్రీకృతమై కురిసిన రాళ్ల వాన సాగులోని పంటలను తీవ్రంగా నష్టపర్చిందని శివారు రైతులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. పంటలకు జరిగిన నష్టాన్ని గుర్తించి ప్రభుత్వ పరంగా పరిహారం చెల్లించాలని బాధిత రైతులు అభ్యర్థిస్తున్నారు.

**శివారులో నేలరాలిన మామిడి**

గాలి దుమారంతో కూడిన వర్షం కారణంగా భీమారం మండలంలో గల మామిడి తోటలకు తీవ్రంగా నష్టం జరిగింది. వేగంగా వీచిన గాలిదుమారంతో మామిడి చెట్లు విరిగిపోగా కొత దశలో ఉన్న మామిడి కాయ నేలరాలిందని మామిడి రైతులు పానగంటి లచ్చయ్య, పోటు తిరుపతి రెడ్డి, భూపల్లి లచ్చయ్య ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. ఆర్కెపల్లి, పోతన్‌పల్లి శివారుల్లో కోతకొచ్చిన వరి పైరు పడిపోవడంతో పంట దిగుబడికి తీవ్రంగా నష్టం జరిగిందని పోతన్‌పల్లి శివారు రైతులు శ్రీనివాస్, ఆయిలి నరేందర్, శరపత్ నాయక్ తదితరులు పేర్కొంటున్నారు. వర్షం అంతంతమాత్రంగా కురిసినా గాలిదుమారంతో వరి, మామిడి పంటలను నష్టపోవల్సి వచ్చిందని వాపోతున్నారు.

**మందమర్రి :** మంగళవారం కురిసిన అకాల వర్షంతో చేతికి వచ్చిన ధాన్యం తడిసి ముద్దయింది. నిన్నటి వరకు 45 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కాగా మంగళవారం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి వర్షం కురిసింది. వాన వల్ల సారంగపల్లి గ్రామం లో ఎండకు ఆరబెట్టిన వరి ధాన్యం పూర్తిగా తడిసిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ఆలస్యం చేసినందు వల్లనే చేతికొచ్చిన తమ పంట నాశనమయ్యిందని రైతులు వాపోతున్నారు. నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేసారు.


మందమర్రిలో తడిసిన వరి ధాన్యం

## కుందారం అటవీ ప్రాంతంలో చిరుత పులి సంచారం

నవతెలంగాణ-జైపూర్



మండల పరిధిలోని కుందారం అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తున్నట్లు అటవీ అభివృద్ధి సంస్థ ప్లాంటేషన్ మేనేజర్ సురేష్ కుమార్ తెలిపారు. అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నీలగిరి ప్లాంటేషన్‌లో చిరుత పులి అడుగులు గుర్తించినట్లు తెలిపారు. రక్షిత అటవీ ప్రాంత సరిహద్దు గ్రామాలైన ఆరెపల్లి, కుందారం, నర్సింగాపూర్, మద్దులపల్లి నివాసులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. చిరుత పులి సంచారాన్ని దృష్టిలో పెట్టుకుని అప్రమత్తంగా ఉండటంతో పాటు అటవీ ప్రాంతంలోకి వెల్లకుండా ఉండాలని, ప్రధానంగా పశుకాపరులు చాలా జాగ్రత్తగా ఉండాలని కోరారు. అడవులు ఆవాసంగా జీవించే అడవి జంతుల ఉనికికి భంగం కలుగకుండా గ్రామీణులు జాగ్రత్తపడాలని కోరారు. వచ్చిపోతుండే పులుల సంచారంతో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జాగ్రత్తలు పాటిస్తే సరిపోతుందని ఆయన తెలిపారు.

## బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలి

నవతెలంగాణ-లక్షెట్టిపేట

బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కొత్తూరు మాజీ సర్పంచ్ సొల్లు సురేష్ తెలిపారు. మంగళవారం మండలంలోని కొత్తూరు గ్రామంలో ఉపాధి హామీ కూలీల పని ప్రదేశంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం కూలీలకు మజ్జిగ ప్యాకెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మోటపలుకుల శ్రీనివాస్, గ్రామకమిటీ ఉపాధ్యక్షుడు గోలేటి మల్లేష్, ప్రధానకార్యదర్శి చెరుకు తిరుపతి, యూత్ ప్రధాన కార్యదర్శి గోలేటి మహేష్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో చేరిన రైతు సమన్వయ సమితి మాజీ కోఆర్డినేటర్

నవతెలంగాణ-జైపూర్

భీమారం మండలం ఎల్బీపేట్ గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు రైతు సమన్వయ సమితి మాజీ కోఆర్డినేటర్ చిప్ప పురుషోత్తం బీఆర్ఎస్‌లో చేరారు. మంగళవారం స్థానిక బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మద్దికల్, కొత్తపల్లి, ఎల్బీపేట్ గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్ సమ్మయ్య, మాజీ ఎంపీటీసీ ఆతుకూరి రాము, గిర్దర్ రెడ్డి ఉన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ గెలుపుకు తనవంతుగా కృషి చేస్తానని ఈ సందర్భంగా చిప్ప పురుషోత్తం తెలిపారు.

## కాంగ్రెస్‌తోనే బడుగు బలహీన వర్గాల అభివృద్ధి

నవతెలంగాణ-జన్నారం

కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే బడుగు బలహీన వర్గాలు అభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ ఎంపీపీ మచ్చ శంకరయ్య, సీనియర్ నాయకులు బండారి స్వామి అన్నారు. మంగళవారం మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో గడపగడప తిరుగుతూ కాంగ్రెస్ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణకు ఓటు వేయాలని కోరారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు, విస్తృతంగా ప్రచారం చేశారు. చేతి గుర్తుకు ఓటు వేసి ఆత్రం సుగుణను గెలిపించాలని కోరారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి ఉపాధి హామీ కూలీలు దినసరి కూలీ రూ.400 ఇస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 6 గ్యారంటీ పథకాలను తప్పకుండా పూర్తిస్థాయిలో అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ముజాఫర్ అలీ ఖాన్, మేకల మాణిక్యం, జిల్లా నాయకులు మోహన్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, మిక్కిలినేని రాజశేఖర్, అల్లం వెంకట రాజం, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ రియాజుద్దీన్, పసియుల్లా, నందు నాయక్, దుర్గం గంగాధర్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పట్టణ ఇన్‌చార్జి రాజీనామ

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

బీఆర్ఎస్ పట్టణ ఇన్‌చార్జి, సీనియర్ నాయకుడు గాండ్ల సమ్మయ్య పార్టీకి, పదవికి రాజీనామా చేస్తున్నట్లు మంగళవారం ప్రకటించారు. గురువారం స్థానిక రాజీవ్ చౌక్ లో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ మార్పుపై మాట్లాడుతూ తనను నమ్ముకుని ఉన్న పట్టణ కుల సంఘాలు, వృత్తి సంఘాలకు న్యాయం చేసేందుకు పార్టీ వీడుతున్నట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం కుల సంఘాలకు, వృత్తి సంఘాలకు యూనియన్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చక పోవడమే ప్రధాన కారణమని తెలిపారు.

## చెరువు పూడికతీత పనుల పరిశీలన

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పోనకల్ గ్రామ శివారులోని చెరువులో ఈజీఎస్ ద్వారా చేపట్టిన పూడికతీత పనులను డీఆర్డీఏ పీడీ కిషన్, అడిషనల్ పీడీ బి దత్తారం సందర్శించారు. మంగళవారం పొనకల్ ఉర చెరువులో జరుగుతున్న, పనులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. కొలతల ప్రకారం రూ.300 వచ్చే విధంగా పనిచేయాలని కూలీలను వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శశికళ, ఎంపీఓ ఎస్.రమేష్ ఈజీఎస్ ఏపీఓ రవీందర్ పాల్గొన్నారు.

## పసికందు ప్రాణాలు కాపాడిన వ్యక్తికి సన్మానం

నవతెలంగాణ-జన్నారం

సోమవారం సాయంత్రం మండల కేంద్రం నుంచి ధర్మారం వెళ్లే ప్రధాన రహదారి పక్కనే కల్వర్టు దగ్గర, చెత్త కుప్పలో పడవేసిన ఆడ శిశువుని గుర్తించి పోలీసులకు సమాచారం అందించి ఆ ఆడ శిశువు ప్రాణాలు కాపాడిన బీఆర్ఎస్ నాయకులు ప్రవీణ్‌కు జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, మంగళవారం మండల కేంద్రంలో శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు, మానవతా విలువలను కాపాడుకుంటూ జీవించాలన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి సిటీ మాల భరత్ కుమార్, నాయకులు వజ్రాల లచ్చన్న, జాజాల శ్రీకాంత్, మైనారిటీ నాయకులు ఇమ్రాన్, కొత్త శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఆత్రం సక్కు గెలుపుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలి

- బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్



నవతెలంగాణ-జన్నారం

బీఆర్ఎస్ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపు నాకు ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ అన్నారు. మంగళవారం సాయంత్రం మండల కేంద్రంలోని, ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గత ఎమ్మెల్యే ఎన్నికల్లో పొరపాట్లకు తావివ్వకుండా కార్యకర్తలంతా కలిసికట్టుగా ఉండి, ఇప్పటి ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం పాత పెట్రోల్ పంపు నుంచి బస్టాండ్ వరకు, భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుర్రం రాజారాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి జనార్ధన్, జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, కోఆప్షన్ సభ్యులు మున్వార్ అలీ ఖాన్, జిల్లా నాయకులు ఫజల్ ఖాన్ మండల యూత్ అధ్యక్షుడు పేరం శ్రీనివాస్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు జాడి గంగాధర్, సీనియర్ నాయకులు తాళ్లపల్లి రాజేశ్వర్, కే నర్సింలు, జిల్లా అధికార ప్రతినిధి సిటీ మల్ల భరత్ కుమార్, గొర్లకుంట ప్రభుదాస్ పాల్గొన్నారు.

## జోరుగా కొనసాగుతున్న కాంగ్రెస్ ప్రచారం

నవతెలంగాణ-లక్షెట్టిపేట

మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులో కాంగ్రెస్ నాయకులు మంగళవారం గడపగడపకు ప్రచారం నిర్వహించారు. పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లోనే ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత కరెంట్, రూ.500కే గ్యాస్ సిలిండర్, పది లక్షల వరకు ఆరోగ్యశ్రీ కార్యక్రమాలు అమలు చేస్తుందని, రాబోవు రోజుల్లో ఇచ్చినటువంటి మరికొన్ని హామీలను కూడా పూర్తి చేస్తుందని ప్రజలకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఆరిఫ్, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ చింతా అశోక్, 13వ వార్డు అధ్యక్షుడు సయ్యద్ హాజీ, సీనియర్ నాయకులు కొత్త వెంకటేశ్వర్లు, సయ్యద్ హఫీజ్, బొప్పు సతీష్ బాణాల రమేష్, వెంకట్ స్వామి, సత్యం, చంద్రమౌళి, అమీర్, చిన్న రమేష్, నయిం, ఇక్బాల్, మోహన్, శ్రీధర్ పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-జైపూర్

మండలంలోని శివ్వారం గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో మంగళవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. శివ్వారంతో పాటు పరిసర గ్రామ శివారు రైతుల సౌకర్యార్థం ఇక్కడ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకుడు అర్నె సమ్మయ్య తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందడం కోసం రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆయన తెలిపారు. కొనుగోలు కేంద్రానికి తరలించే ధాన్యంలో తాలు తప్పా ఉండకుండా చూసుకోవాలని, తేమ శాతం సరి చూసుకోవాలని కోరారు.

## గడప గడపకు కాంగ్రెస్ ప్రచారం

నవతెలంగాణ-కాసిపేట

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కనుకుల రాకేష్ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని పెద్దనపల్లి పంచాయతీలోని న్యూ కాలనిలో గడప గడపకు ప్రచారం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను తెలియజేస్తూ తప్పకుండా ప్రతి ఒక్కరు చేతి గుర్తుకు ఓటు వేసి పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు తిరుపతి, సోషల్ మీడియా ఇన్‌చార్జి గణేష్, కొండాపూర్ గ్రామ అధ్యక్షుడు ఆనంద చారి, కాసిపేట, లంబడితండా(కె), కొండాపూర్, లంబడితండా(డి) యూత్ గ్రామ కమిటీ అధ్యక్షుడు చిన్నాలి మధు, బాణోత్ రవి, ఒల్లెపు నరేష్, రాజు ఉపాధ్యక్షుడు కృష్ణ, ఒల్లెపు రాము, పోడేటి చందు, మాజీ ఉప సర్పంచ్ జర్పుల తిరుమల్, మాజీ వార్డ్ సభ్యుడు కొత్త రమేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు నందికొండ శ్రీధర్, కుడ్మెత తిరుపతి పాల్గొన్నారు.

# మతోన్మాద, కార్మిక వ్యతిరేక బీజేపీని ఓడించండి




నవతెలంగాణ-నస్పూర్

పార్లమెంటు ఎన్నికలలో మతోన్మాద కార్మిక వ్యతిరేక బీజేపీని ఓడించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. మంగళవారం సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆర్కే-7 గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో సీపీఐ బలపరుస్తున్న కాంగ్రెస్ పెద్దపెల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణతో హాజరై మాట్లాడారు. దేశంలో మతాల మధ్య చిచ్చు పెడుతున్న, కార్మికుల వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీని ఓడించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా మార్చిందని ఆరోపించారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను కార్పోరేట్లకు కట్టబెట్టారన్నారు. రాజ్యాంగం మార్పు పేరుతో దేశాన్ని నాశనం చేసేందుకు కుట్ర పన్నుతున్న బీజేపీ రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి వంశీకృష్ణ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కార్మికులు ఎదురుచూస్తున్న పెర్క్స్‌పై ఐటి మినహాయింపు, సొంత ఇంటి పథకం, నూతన బొగ్గు గనుల కొరకు కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాల కొరకు గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ ప్రతిపాదనను పరిగణలోకి తీసుకొని ఎన్నికల అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సింగరేణి కార్మికులకు సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అలాగే కాంట్రాక్టు కార్మికుల కనీస వేతనాలు అమలఅయ్యేలా ప్రయత్నం చేస్తానని హామి ఇచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో సింగరేణి కార్మికులంతా ఐక్యమత్యంతో చేతి గుర్తుకు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కార్మికులను కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కె బాజీ సైదా, బ్రాంచ్ ఉపాధ్యక్షులు కొట్టే కిషన్ రావు, సంపత్, రాచర్ల చంద్రమోహన్, ఏరియా కార్యదర్శి మారపల్లి సారయ్య, బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్ పాల్గొన్నారు.

# హామీల అమలులో ఏమాత్రం తగ్గేది లేదు

- చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

నవతెలంగాణ-జైపూర్

అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలులో ఏమాత్రం తగ్గేది లేదని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం భీమారం మండలంలో విస్తృతగా పర్యటించారు. భీమారం గ్రామ పంచాయతి కొత్తగూడెం శివారులో ఉపాధి హామీ పనులు పరిశీలించిన ఆయన కూలీలో కలిసి పనుల్లో పాల్గొన్నారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కూలీ రేటు పెంచిందని గుర్తు చేశారు. గ్యాస్ సిలిండర్‌కు సంబంధించిన నగదు బదిలీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ తదితర పథకాల అమలులో వినియోగదారుల వివరాలు సరి చూసి అర్హులందరికి పథకాలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్ తదితర పథకాలకు సంబంధించిన వినియోగదారులు సంబంధిత సంస్థలకు ఖచ్చితమైన వివరాలు అందించాలని తెలిపారు.

**మండలంలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే**

భీమారం మండలంలో గల 11 గ్రామ పంచాయతీల్లో ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి విస్తృతంగా పర్యటించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్



బలపర్చిన గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి మోహన్‌రెడ్డితో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ధర్మారం, రెడ్డిపల్లి, దాంపూర్, కాజిపల్లి, నర్సింగాపూర్, భూర్గుపల్లి, పోలంపల్లి, కొత్తపల్లి, మద్దికల్, ఎల్కేశ్వరం, ఆరెపల్లి గ్రామాల్లో పర్యటిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

# కాకా కుటుంబంతో ప్రజలకు నష్టం

- మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య
- గురువాపూర్‌లో బీఆర్ఎస్ విస్తృత ప్రచారం



నవతెలంగాణ-కాసిపేట

కాకా కుటుంబ పాలనతో ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుందని, వీరు ప్రజలకు ఏ మాత్రం అందుబాటులో ఉండని కార్పోరేట్ వ్యాపారులని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పరోక్షంగా గడ్డం వినోద్, వివేక్ వెంకటస్వామిని విమర్శించారు. మంగళవారం మండలంలోని గురువాపూర్లో ఈజీఎస్ కార్మికులతో నేరుగా మాట్లాడడంతో పాటు గ్రామంలో పర్యటించి బీఆర్ఎస్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే అన్నాదమ్ములు ఇద్దరు ఎమ్మెల్యేగా ప్రజలకు అందుబాటులో ఉండడం లేదన్నారు. మళ్లీ ఎంపీ ఎన్నికల్లో కొడుకును తీసుకువచ్చి కుటుంబ పాలన సాగించేందుకు ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. డబ్బులతో రాజకీయం చేసే గడ్డం కుటుంబానికి ఈ ఎన్నికల్లో చిత్తుగా ఓడగొట్టి బుద్ధి చెప్పాలని కోరారు. నిత్యం ప్రజలకు అందబాటులో ఉండే, ప్రజా సమస్యలు పరిష్కరించే మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కేసీఆర్ బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ ఇప్పటి పరిస్థితులపై అవగాహన కల్పిస్తూ ప్రచారం చేశారు. ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసుకు తాళం పెట్టి హైదరాబాద్‌లో ఉంటున్నారని గుర్తు చేశారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, ఎంపీటీసీ కొండబత్తుల రాంచందర్, మాజీ సర్పంచ్ ఆడె బాదు, మాజీ ఉప సర్పంచ్ బోయిని తిరుపతి యాదవ్, కార్యదర్శి మోటూరి వేణు, వర్కింగ్ ప్రెసిడెంట్ రాంటెంకి వాస్ దేవ్, గ్రామ అధ్యక్షుడు అగ్గి సత్తయ్య, అక్కెపల్లి బుగ్గ రాజు, కరీం, సాయి కుమార్, శేఖర్, సుధాకర్, అంజన్ కుమార్, కిరణ్ పాల్గొన్నారు.

## తునికాకు సేకరణకు అడ్డుగా మారిన వడగండ్ల వాన

నవతెలంగాణ-చింతలమానెపల్లి



మండలంలోని కర్జెల్లి, కేతిని, దింద, చిత్తం, గూడెం, కోయపల్లి, శివ పెల్లి, కోర్సిని, బూరెపల్లి, ఆయా గ్రామాల్లో తునికాకు ఉపాధి కూలీలకు అకాల వర్షం అడ్డుగా మారింది. గిరిజన కూలీలు, రైతులు వేసవిలో వ్యవసాయం లేకపోవడంతో తునికాకు సేకరణ ప్రధాన ఆధారంగా మారింది. 50 ఆకులను ఒక కట్టగా కట్టి, కట్టను రూ.మూడు చొప్పున విక్రయిస్తున్నారు. కూలీ రోజుకు రూ. 600 నుండి రూ.1400 వరకు సంపాదిస్తారు. ఇటువంటి సమయంలో తూనికాకు సేకరణకు అకాల వడగండ్ల వాన రావడంతో ఆకులకు రంధ్రాలు పడి, తెంపేటప్పుడు బిగుసుగా ఉంటాయి. అటువంటప్పుడు గుత్తెదారులు కట్టలను జమలో లెక్కించారు. ఇలా కూలీలకు ఈ అకాల వడగండ్ల వర్షంతో అపార నష్టం ఉందంటున్నారు.

## ఆయిల్ పామ్ పంటల పరిశీలన

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



మండలంలోని కోసినీ గ్రామ శివారులో రైతులు సాగు చేస్తున్న పంటలను మంగళవారం జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి మ్రి వెంకటేశం పరిశీలించారు. ఎండాకాలం ఉష్ణోగ్రతలు దృష్టిలో ఉంచుకొని కొత్తగా వేసిన ఆయిల్ పామ్ మంచి దిగుబడి సాధించేందుకు పలు సూచనలు చేశారు. మొక్కకు మూడు అడుగుల దూరంలో జనుమును పచ్చి రొట్టె ఎరువు పంటగా నాటుకోవాలి జనుము పూతకు వచ్చిన వెంటనే చిన్నచిన్న ముక్కలుగా కోసి పాదలో చుట్టు వేయాలన్నారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారిణి శాంతిప్రియ, మైక్రో ఇరిగేషన్ కంపెనీ ప్రతినిధులు శ్రీనివాస, కిరణ్, ఆయిల్ పామ్ కంపెనీ ప్రతినిధులు రమేష్, ప్రవీణ్, ఆయిల్ పామ్ రైతులు పాల్గొన్నారు.

## గాలి వాన బీభత్సం

- లేచిపోయిన ఇండ్ల పైకప్పులు
- నేలకొరిగిన విద్యుత్‌స్తంభం



నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని గోలేటిలో మంగళవారం మధ్యాహ్నం గాలి వాన బీభత్సం సృష్టించింది. ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. రహదారులపై చెట్లు విరిగిపడ్డాయి. కరెంటు తీగలు తెగిపడడంతో కాలనీల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. పది రోజులుగా ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలకు ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో కొంత ఉపశమనం లభించింది. సింగరేణి క్వార్టర్లలో ఐదో లైన్‌లో రెండు విద్యుత్ స్తంభాలతో పాటు భారీ చెట్లు కూడా నేలకొరిగాయి. విద్యుత్ వైర్లు తెగిపోవడంతో అధికారులు సరఫరాను నిలిపివేశారు. కొన్నిచోట్ల ఇండ్ల పైకప్పులు లేచిపోయాయి.

## తొలిరోజు ప్రశాంతంగా ఎంసెట్ ప్రవేశ పరీక్ష

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇంజనీరింగ్, అగ్రికల్చర్, మెడికల్ ఇంజినీరింగ్ కోర్సులలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎంసెట్ ప్రవేశ పరీక్ష మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా పట్టణంలోని నలంద కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తొలిరోజు నిర్వహించిన ఎంసెట్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మంగళవారం అగ్రికల్చర్ పరీక్ష నిర్వహించగా ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు సెషన్‌లలో పరీక్ష కొనసాగింది. పరీక్షలకు నిమిషం ఆలస్యం నిబంధన ఉండటంతో కేంద్రానికి విద్యార్థులు గంట ముందే చేరుకున్నారు. వారి హాల్ టికెట్, ఆధార్‌తో పాటు బయోమెట్రిక్ ద్వారా హాజరును తీసుకున్నారు. పరీక్ష హాలులోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించలేదు. కాగా ఉదయం పరీక్షకు 93 మంది విద్యార్థులకు గాను 90 మంది విద్యార్థులు, మధ్యాహ్నం పరీక్షకు 92కు గాను 87 మంది విద్యార్థులు హాజరైనట్లు సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్ పున్నారావ్ తెలిపారు. బుధవారం అగ్రికల్చర్ పరీక్ష ఉంటుందని, గురువారం ఇంజనీరింగ్ పరీక్ష ఉంటుందని తెలిపారు.

## పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సక్కుని గెలిపిద్దాం

నవతెలంగాణ ఆదిలాబాద్ రూరల్

పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సక్కు విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం మవాల మండల కేంద్రంలో బీ ఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఉపాధి హామీ పని ప్రదేశంలో కూలీలను కలిసి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను వివరించడంతో పాటు గత బీ ఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివద్ధి,సంక్షేమ కార్యక్రమాలను గుర్తు చేశారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించిన ఈ ప్రాంతం ఏలాంటి అభివద్ధికి నోచుకోలేదని వివరించారు.ఈ ఎన్నికల్లో బీ ఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును అధిక మెజార్టీతో గెలిపించి ఈ ప్రాంత అభివద్ధికి దోహదపడాలని సూచించారు. ఈ ప్రచార కార్యక్రమంలో బీ ఆర్ఎస్ నాయకులు నల్ల రాజేశ్వర్,చందాల రాజన్న,ఉమాకాంత్ రెడ్డి, సుధీర్, అజీమ్ ఖాన్, ఆసీఫ్ ఖాన్,రొక్కడి సంతోష్, కారం సంతోష్, ఇమ్రాన్, అశోక్, పొచ్చన్న పాల్గొన్నారు.

## ఆత్రం సక్కును గెలిపించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని ఎంపీపీ గంద్రత్ రమేష్ అన్నారు. మంగళవారం మండలంలోని అంకాపూర్, పందిరిలొద్ది, చిన్న మారుతీ గూడ, అర్లి(బి) గ్రామాల్లో మంగళవారం ప్రచారాన్ని నిర్వహించారు. కారుగుర్తుకు ఓటు వేసి, ఆత్రం సక్కును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు కొత్తపెల్లి సంతోష్, గేడం రాము, గేడం లీలావతి, కుమ్ర రాజు, మర్సుకొల సురేష్, కోడప భీంరావు, సిడాం గణపతి, కనక రమణ, మాజీ సర్పంచ్ ఐటి వినోద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన విజయ డెయిరీ మాజీ చైర్మెన్

నవతెలంగాణ-ఉట్నూర్

పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను తెలంగాణ విజయ డెయిరీ మాజీ చైర్మెన్ లోక భూమారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ ఎన్నికల్లో తీసుకోవాల్సిన కార్యచరణపై నాయకులు చర్చించారు. ఈ కార్యక్రమంలో జైనథ్ డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్‌రెడ్డి, అజీమ్ ఉన్నారు.

## కంపెనీలు స్థాపించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం

నవతెలంగాణ-నస్పూర్

పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికలలో తనను గెలిపిస్తే ఐటీ కంపెనీలు స్థాపించి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని పెద్దపెల్లి పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థి, ఉస్మానియా ప్రొఫెసర్ నతానియేలు అన్నారు. మంగళవారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కనీస అవగాహన లేని నాయకులు, పెద్దపెల్లి పార్లమెంట్ పరిధిలో ఉన్న ఖనిజ సంపదను దోచుకునే నాయకులకు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని తెలిపారు. తనను పార్లమెంట్ ఎన్నికలలో గెలిపిస్తే పెద్దపల్లిలో ఐటీ కంపెనీని స్థాపిస్తానని, ఖనిజ వనరులను దోపిడీకి గురికాకుండా చూస్తానని, రైతులకు మూడు పంటలకు నీరు అందిస్తానని హామీ ఇచ్చారు. బ్యాలెట్ నెంబర్ 41లోని బకెట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహేందర్ రెడ్డి, డికొండ స్వామి, మోహన్ దాస్ పాల్గొన్నారు.

## జిల్లాలో జోరుగా వన

నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల పట్టణంలో మంగళవారం ఏకధాటిగా దాదాపు 3 గంటల పాటు ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. కొన్ని రోజులుగా ఎండ వేడికి ఉక్క పోతతో అల్లడిన ప్రజలు ఒక్కసారిగా వర్షం కురవడంతో ఉపశమనం లభించింది. గాలి దుమారంతో వచ్చిన వర్షం ఏకధాటిగా 3 గంటలు కురిసింది. దీనితో పట్టణంలోని పలు రోడ్లు నీటితో నిండి పోయాయి. గంట పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఒక్క సారిగా వర్షంతో వాతావరణం చల్లగా మారడంతో ప్రజలు ఆస్వాదించారు.

## కార్మికుల త్యాగాలతోనే ఎనిమిది గంటల పనిదినం

- సీఐటీయూ అఖిల భారత కోశాధికారి సాయిబాబు
- మేడే వారోత్సవాల ముగింపు సభ
- పట్టణంలో అనుబంధ సంఘాలతో ర్యాలీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అమెరికాలోని చికాగోలో ప్రారంభమైన కార్మిక ఉద్యమంతో ఎనిమిది గంటల పని దినం ప్రపంచ వ్యాప్తమైందని, ప్రస్తుత కాలంలో కార్మికుల హక్కులకు అండగా ఎర్రజెండా నిలిచిందని సీఐటీయూ అఖిల భారత కోశాధికారి ఎం. సాయిబాబు గుర్తు చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓస్ గార్డెన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో మేడే వారోత్సవాల సభ నిర్వహించారు. అంతకు ముందు సీఐటీయూ కార్యాలయం నుంచి సభ వేదిక వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ అఖిలభారత కోశాధికారి సాయిబాబు మాట్లాడుతూ కార్మికులు హక్కులు, ఎనిమిది గంటల పనిదినం కోసం ప్రాణాలర్పించి చట్టాలు సాధించుకున్నారన్నారు. 1886 మే 1న అమెరికాలోని చికాగోలో పెట్టుబడి దారులకు వ్యతిరేకంగా కార్మికవర్గం ఎనిమిది గంటల పని దినం కోసం ఉద్యమించిందన్నారు. ఆ క్రమంలో అక్కడి ప్రభుత్వం వారిపై పోలీసులతో కాల్పులు జరిపించడంతో అనేక మంది కార్మికులు అమరలయ్యారన్నారు. వారి త్యాగల కారణంగా నేడు ప్రపంచ వ్యాప్తంగా ఎనిమిది గంటల పని దినాలు అమలవుతున్నాయన్నారు. కార్మికులు చిందించిన రక్తపు మడుగులోనే ఎర్ర జెండా పుట్టిందన్నారు. కార్మికుల హక్కుల కోసం సీఐటీయూ అనేక ఉద్యమాలు చేసి సాధించిందని గుర్తు చేశారు.

**ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు పోరాడాలి...**

భారత కార్మికవర్గం భారత రాజ్యాంగ రక్షణకు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకై పోరాడాలన్నారు. బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో 2014 అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాజ్యాంగం మౌలిక సూత్రాల పైన దాడి చేస్తోందని అన్నారు. కార్మిక హక్కులను కాలరాస్తూ చట్టాల సవరణ చేసి లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందన్నారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నదని, దేశ కార్మిక కర్షక వర్గం నిర్మించిన ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు చౌకగా అమ్మేస్తుందన్నారు. లౌకిక ప్రజాతంత్ర భారత రాజ్యాంగం బీజేపీ పాలనలో ప్రమాదంలో పడిందన్నారు. ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం కల్పిస్తున్నదని, కార్మిక వర్గం అనేక త్యాగాలుచేసి, పోరాటాల ద్వారా సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని సవరించి, 12 గంటలకు పెంచి కార్మికులను శ్రమ దోపిడీకి గురి చేసేలా విధానాలను రూపొందిస్తున్నదన్నారు. భారత కార్మిక వర్గం భారత రాజ్యాంగ పరిరక్షణకు కంకణం కట్టుకుని భారత రాజ్యాంగ పరిరక్షణకై నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకై కృషి చేయాలని, పార్లమెంటు ఎన్నికల్లో మతోన్మాదం కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీని ఓడించాలన్నారు. అభ్యుదయ వామపక్ష లౌకిక శక్తులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్ కుమార్, కోశాధికారి కే సునీత, ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్, లింగాల చిన్నన్న, నైతం శోభ, డి.వెంకటమ్మ సహాయ కార్యదర్శులు ఎం.సుజాత, జితేందర్, పెర్క దేవిదాస్, అగ్గిమల్ల స్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి లంక రాఘవులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బండి దత్తాత్రి, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు పండుగ పొచ్చన్న, అక్రామ్ ఖాన్, డి.సునీత, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలి



నవతెలంగాణ-నార్నూర్

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ జాదవ్, మాజీ సర్పంచుల సంఘం మండలాధ్యక్షుడు యూర్వేత రూపదేవ్ కోరారు. మంగళవారం లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా తాడిహత్నూర్ సంతలో ప్రచార రథం ద్వారా ప్రచారం చేసి, ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. అంతకుముందు కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోని ప్రజలకు వివరించారు. కారుగుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి సయ్యద్ ఖాసీం, ఉపసర్పంచ్ విష్ణుడ్, జామడ మాజీ సర్పంచ్ ముక్తా రూపదేవ్, మండల సోషల్ మీడియా ఇన్‌ఛార్జి సూర్యవంశీ శశాంక్, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## కాంగ్రెస్ పార్టీతోనే పేదల అభివృద్ధి సాధ్యం

నవతెలంగాణ-రెబ్బెన

కాంగ్రెస్ పార్టీతోనే పేదల అభివృద్ధి సాధ్యమని, రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడానికి పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని నాయకులు అన్నారు. మంగళవారం మండలంలోని గోలేటిలోని భగత్‌సింగ్ నగర్, దుబ్బగూడం, గోలేటి టౌన్ షిప్‌లో ప్రచారం నిర్వహించారు.

## ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలి

నవతెలంగాణ-బేల

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి అన్నారు. మంగళవారం మండలంలోని మాంగ్రూడ్ గ్రామం నుంచి ఎన్నికల ప్రచారాన్ని మొదలు పెట్టారు. గ్రామంలో రోడ్‌షో నిర్వహించి, ప్రజలకు అభివాదం చేశారు. మాంగ్రూడ్, కొగ్దూర్, మొహబత్‌పూర్, శంషాబాద్, కాప్సి(బి), డోప్టాల, టాక్లీ, భవానిగూడ, ఎకోరి, మసాల(బి), దౌన, సైద్‌పూర్, తోయగూడ గ్రామాల్లో తమ ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నియోజకవర్గం అభివృద్ధి చేందాలంటే కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని ఆత్రం సుగుణకు ఓటు వేయాలని అన్నారు. బీజేపీ ఈ పదేండ్లలో ధరలు పెంచడం తప్ప మరేమీ చేయలేదని అన్నారు. రూ.4వందలు ఉన్న సిలిండర్ ధరను రూ.12వందలకు పెంచి పేద, మధ్యతరగతి ప్రజల నడ్డీ విరిచిందని అన్నారు. ఈ సారి ఇక్కడ ఆదిలాబాద్‌లో ఆత్రం సుగుణ గెలుపుతోపాటు కేంద్రంలో కూడా ఇండియా కూటమి ఏర్పడుతుందని రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మెన్ అడ్డి భోజారెడ్డి, కౌన్సిలర్ కలాల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఫైజుల్లా ఖాన్, మాజీ జెడ్పీటీసీ రాందాస్ నాక్లే, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ వామన్ వాంఖడే, సుదాంరెడ్డి, ఎంపీటీసీ నగేష్‌రెడ్డి, యూత్ అసెంబ్లీ జనరల్ సెక్రటరీ సామా రూపేష్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షులు ఘన శ్యామ్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు మడవి చంద్రకాంత్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సంజయ్ గుండావార్, అవినాష్ భేదొడ్కర్, శంకర్ బొక్రె, అవినాష్ గోడే, విలాస్ సావాపూర్ పాల్గొన్నారు.



## కౌంటింగ్ కేంద్రంలో సౌకర్యాలు కల్పించాలి

- జిల్లా ఎన్నికల అధికారి బదావత్ సంతోష్



నవతెలంగాణ-నస్పూర్

జూన్ 4న జరుగనున్న కౌంటింగ్ ప్రక్రియకు కౌంటింగ్ కేంద్రంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం హాజీపూర్ మండలం ముల్కల్లలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల నిర్వహణ, కౌంటింగ్‌కు పూర్తి స్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలన్నారు. చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించి కౌంటింగ్ జరుగుతుందని, ఈ ప్రక్రియకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు, అవాంఛనీయ ఘటనలు జరుగకుండా బందోబస్తు నిర్వహించాలని ఆదేశించారు. కౌంటింగ్ హాలు, కౌంటర్లు, విద్యుత్, ఇంటర్నెట్, తాగునీరు ఇతరత్రా సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి.రాహుల్, సబావత్ మోతిలాల్, ఆర్డీఓ వి.రాములు, ప్రత్యేక అదనపు కలెక్టర్ డి.చంద్రకళ, హాజీపూర్ తహసీల్దార్ పి.సతీష్ కుమార్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

## మొక్కు తీర్చుకుందామని వచ్చి మృత్యు ఒడిలోకి..

నవతెలంగాణ-దిలావర్‌పూర్

ఎల్లమ్మ దేవుని సన్నిధిలోకి మంగళవారం మొక్కు తీర్చుకోవడానికి వచ్చి మృత్యు ఒడిలోకి చేరిన సంఘటన మంగళవారం దిలావర్‌పూర్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై సుమాంజలి తెలిపిన వివరాల ప్రకారం.. తన కూతురు ఎల్లమ్మ దేవస్థానంలో పండుగ చేస్తుందని, కుంటాల మండలం కల్లూరు గ్రామానికి చెందిన రామస్వామి(70) ఆనందోత్సాహాలతో గుడికి చేరుకున్నారు. మొక్కులు తీర్చుకోవడానికి ముందుగా ఎల్లమ్మ దేవస్థానం వద్ద గల కోనేరులో స్నానానికి వెళ్లాడు. కోనేరులో దిగిన అతనికి లోతు తెలియక పోవడంతో కొద్ది దూరంలోకి వెళ్లి ఈత రాక నీటిలో మునిగిపోయాడు. అక్కడ ఉన్న భక్తులు కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేక నీటిలో మునిగి మృతి చెందాడు. మొక్కు తీర్చుకోవడానికి వచ్చి, పండుగ చేద్దామనుకున్న కూతురుకు తండ్రి హఠన్మరణంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు

నవతెలంగాణ-దండేపల్లి

పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు కార్యకర్తలకు దేశాన్ని నిర్దేశం చేశారు. మంగళవారం మండలంలోని తాళ్లపెట్, నాగసముద్రం, మాకులపేట్, లింగాపూర్, అల్లిపూర్, దండేపల్లి, నర్సాపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని హామీలను నెరవేర్చే దిశగా పనిచేస్తుందని, ఇచ్చిన ఏఒక్క హామీని కూడా విస్మరించమని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీజేపీ బందీ నుండి దేశాన్ని కాపాడుకుందాం

- ఎమ్మెల్యేతో కలిసి పుస్తకాన్ని ఆవిష్కరించిన సీపీఐ(ఎం) నాయకులు



నవతెలంగాణ-జైపూర్

బీజేపీ బందిఖానలో ఉన్న భారతదేశాన్ని కాపాడుకోవాల్సిన అవసరముందని సీపీఐ(ఎం) నాయకులు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం భీమారం మండలం దాంపూర్, ధర్మారంలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామితో కలిసి బీజేపీ బందిఖాన నుంచి దేశాన్ని కాపాడుకుందాం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. మతోన్మాద బీజేపీకి ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని, ఇండియా కూటమి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పెద్దపల్లి పార్లమెంట్ స్థానం నుండి పోటీ చేస్తున్న గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లా సీపీఐ(ఎం) కార్యదర్శులు సంకే రవి, యాకయ్య, జిల్లా కమిటీ నాయకులు ముత్యంరావు, ప్రకాష్, తుంపల రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

## 'ఢిల్లీ పార్టీల వలన రాష్ట్రాభివృద్ధి జరగదు'

నవతెలంగాణ-నస్పూర్

ఢిల్లీ పార్టీల వలన రాష్ట్ర అభివృద్ధి జరగదని బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు, నడిపెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విజిత్ రావు అన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో పార్టీ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ భారీ మెజార్టీతో గెలిపించాలని మంగళవారం 15వ వార్డులో ప్రచారాన్ని నిర్వహించారు. తెలంగాణ అభివృద్ధి కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ద్వారానే సాధ్యమవుతుందన్నారు. ప్రశ్నించే గొంతుక అయ్యే పార్టీ ఎంపీ అభ్యర్థులు గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ అధ్యక్షుడు అక్కురి సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి మెరుగు పవన్ కుమార్, కౌన్సిలర్ వంగ తిరుపతి, మేదరబోయిన గట్టయ్య, గరిశే రామస్వామి, కందుల ప్రశాంత్, దగ్గుల మధు పాల్గొన్నారు.